# కాంగ్రెస్ సీఎంలు బ్యాలెట్ ఎన్నికలకు సిద్ధమా?

## కేంద్ర మంత్రి బండి సంజయ్



**హైదరాబాద్ పెన్ పవర్:** హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, కేరళం రాష్ట్రాల సీఎంలతో రాజీనామా చేయించి బ్యాలెట్ ఎన్నికలకు వచ్చే ధైర్యం కాంగ్రెస్ పార్టీకి ఉందా? అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. 'ఈవీఎంల వల్లే కాంగ్రెస్ పార్టీ కేరళం, తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో గెలిచింది కదా? మరి ఆ నాలుగు రాష్ట్రాల సీఎంలు రాజీనామా చేసి కాంగ్రెస్ ప్రభుత్వాలను రద్దు చేసి బ్యాలెట్ పేపర్లతో మళ్లీ ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమా? పదేపదే ఈవీఎంల గురించి, సర్ గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు నా సవాల్‌ను స్వీకరించాలి. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌కు భాజపాకు ఏం సంబంధం? ఇండీ కూటమికి జనాదరణ లేదు. ముంబయి, దిల్లీ ఆందోళనలకు జనం పెద్దగా రాకపోవడమే దీనికి నిదర్శనం. ప్రపంచమంతా కెప్టెన్ స్మిత్ మచ్చుర్ ధైర్యసాహసాలను కొనియాడుతుంటే రాహుల్, కాంగ్రెస్ నేతలు కనీసం స్పందించకపోవడం దారుణం. దిల్‌సుఖ్‌నగర్ సంతోషీమాత దేవాలయంలో దాడి హేయం. హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దాడికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటే ఈ పరిస్థితి రాదు' అని సంజయ్ పేర్కొన్నారు.

# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్




### క్యాంప్ వివరాలు...

- తేదీ: అక్టోబర్ 4,(నేడు) 2026
- సమయం: ఉదయం 6:00 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు
- వేదిక: దుండిగల్ వార్డ్ ఆఫీస్
- టీకాలు: ఉచిత యాంటీ రేబీస్ వ్యాక్సినేషన్
- సమన్వయం: బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్, పశు సంవర్ధక శాఖ, డబ్ల్యువిఎస్, మిషన్ రేబీస్..

మరిన్ని వివరాలకు 8885343470 నంబర్‌లో సంప్రదించవచ్చని, info@bluecrossofhyd.org ఈమెయిల్ ద్వారా సమాచారం పొందవచ్చని నిర్వాహకులు తెలిపారు..




# దుండిగల్‌లో కుక్కలకు ఉచిత యాంటీ రేబిస్ టీకాలు..!




**అక్టోబర్ 4న(నేడు) దుండిగల్ వార్డ్ ఆఫీస్ వద్ద ప్రత్యేక క్యాంప్..!**

**దుండిగల్, పెన్ పవర్, అక్టోబర్ 3:** దుండిగల్ సర్కిల్ పరిధిలో కుక్కలకు ఉచిత యాంటీ రేబిస్ టీకాలు వేసే ప్రత్యేక కార్యక్రమాన్ని అక్టోబర్ 4న (నేడు) నిర్వహించనున్నట్లు దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డా.ఎస్. వెంకట మణి కరణ్ తెలిపారు.. దుండిగల్ వార్డ్ ఆఫీస్ వద్ద ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ క్యాంప్ కొనసాగుతుందని పేర్కొన్నారు.. బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ సౌజన్యంతో, పశుసంవర్ధక శాఖ, డబ్ల్యువిఎస్, మిషన్ రేబీస్ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రేబీస్ వ్యాధి నివారణతో పాటు తెలంగాణను రేబీస్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ ప్రత్యేక టీకాల కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు.. పెంపుడు కుక్కలతో పాటు పరిసర ప్రాంతాల్లోని వీధి కుక్కలకు కూడా యాంటీ రేబీస్ టీకాలు వేయించాలని అధికారులు ప్రజలకు సూచించారు. రేబీస్ వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని సహకరించాలని కోరారు.

# ఎన్ని మాధ్యమాలున్నా పుస్తకం విలువ తగ్గదు

## మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

వివరాలు 5లో..

- సూచిక బోర్డులు పెట్టని కాంట్రాక్టర్.. వాహన దారులకు తప్పని అవస్థలు..
- రెండు కిలోమీటర్లు వెళ్లి వెనుదిరుగుతున్న వాహనదారులు..!
- రెండు రోజులుగా ప్రత్యామ్నాయ మార్గాన్ని సూచిస్తున్న సామాజిక వేత్త రవీందర్..
- అధికారుల స్పందన కోసం ఎదురు చూడకుండా..
- సొంత ఖర్చుతో సూచిక బోర్డులు ఏర్పాటు చేసిన సామాజిక కార్యకర్త..
- ఇప్పటికైనా ట్రాఫిక్ మళ్ళింపుపై స్పష్టమైన సూచిక బోర్డుల ఏర్పాటుకు విజ్ఞప్తి..
- ముందస్తు సమాచారం లేక 2 కిలోమీటర్లు వెళ్లి వెనుదిరుగుతున్న వాహనాలు..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, అక్టోబర్ 3:** రహదారి విస్తరణ పనుల్లో భాగంగా, వాహన దారులను ముందుగానే అప్రమత్తం చేయాల్సిన కనీస హెచ్చరిక, సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం తీవ్ర విమర్శలు లేవనెత్తుతోంది.. రహదారి మూసివేత, ప్రత్యామ్నాయ మార్గం వంటి వివరాలను స్పష్టంగా తెలియజేయాల్సిన చోట ఎలాంటి ముందస్తు సమాచారం లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. ముఖ్యంగా భారీ వాహనాలు, లారీలు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు సైతం కొంతదూరం వెళ్లిన తర్వాత రహదారి పనులు కొనసాగుతున్న విషయం తెలుసుకుని తిరిగి వెనుదిరగాల్సిన పరిస్థితిపై ఓ సామాజిక వేత్త రెండు రోజులుగా దారి మళ్ళింపును వాహనదారులకు వివరించడం తోపాటు, సొంత ఖర్చులతో సూచిక బోర్డులను ఏర్పాటు చేయడం స్థానికంగా పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు.. కుత్బుల్లాపూర్ మండలం సూరారం ఎక్స్‌రోడ్ నుంచి విశ్వకర్మ కాలనీ మీదుగా మియాపూర్ వైపుకు చేరుకోవాలన్నా..! బౌరంపేట్, శంబిపూర్, ఐడీఏ బొల్లారం, వైపు వెళ్లే ఈ మార్గంలో సూరారం గ్రామం--విశ్వకర్మ కాలనీ ప్రాంతాన్ని దాటిన తర్వాత రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి..

-4లో




# రోడ్డు విస్తరణ పనుల్లో..! నిబంధనలకు తిలోదకాలు..!

# పేదలకు రూ.300 కోట్లతో 5 వేల ఇళ్లు

## తాన్లా ఫౌండేషన్ చేయూత: మంత్రి పొంగులేటి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో తాన్లా ఫౌండేషన్ ఎండీ దాసరి ఉదయ్‌కుమార్‌రెడ్డి సహకారంతో రూ.300 కోట్లతో 5వేల ఇళ్లు నిర్మించబోతున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. సత్తుపల్లి మండలం గంగారంలోని తాన్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో అధునాతన సాంకేతికతతో ఏర్పాటు చేసిన ల్యాబొరేటరీ సర్వీసెస్‌ను శనివారం ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, జారె ఆదినారాయణలతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. తాను పార్లమెంటు సభ్యుడిగా ఉన్నప్పుడు గంగారాన్ని దత్తత తీసుకున్నానని, అయితే ఆశించిన మేరకు అప్పట్లో అభివృద్ధి చేయలేకపోయాయన్నారు. ప్రస్తుతం ఈ గ్రామంలో పేదలు ఉన్నారని, ఇళ్ల స్థలాలు ఇస్తే తాన్లా ఫౌండేషన్ ద్వారా ఎన్ని వందల ఇళ్లు అయినా నిర్మిస్తానని ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారని పేర్కొన్నారు. దీంతో సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో ప్రభుత్వ భూమి ఇస్తామని పేదలకు 5వేల ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరగా ఆయన అంగీకరించినట్లు వివరించారు. ఇందుకు రూ.300 కోట్లు ఖర్చు చేయనున్నారని తెలిపారు. ఈ దసరా పండగ రోజునే గంగారంలో ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేసి ఏడాదిన్నరలోగా పూర్తి చేసి సీఎం రేవంత్‌రెడ్డితో ప్రారంభిస్తామన్నారు. హైదరాబాద్‌లోనూ రూ.70 కోట్లతో వైద్యశాల నిర్మించి ప్రభుత్వానికి ఇస్తున్నారని, దానిని డిసెంబరులో సీఎం ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అదే స్థాయిలో గంగారంలోనూ 20ఎకరాల్లో ఆసుపత్రి నిర్మించి ఉచితంగా పేదలకు వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. కలెక్టర్ దివాకర టీఎస్, సీపీ సునీల్‌దత్, ఐటీడీఏ పీఓ రాహుల్ పాల్గొన్నారు.

- సూచిక బోర్డులు పెట్టని కాంట్రాక్టర్.. వాహన దారులకు తప్పని అవస్థలు..
- రెండు కిలోమీటర్లు వెళ్లి వెనుదిరుగుతున్న వాహనదారులు..!
- రెండు రోజులుగా ప్రత్యామ్నాయ మార్గాన్ని సూచిస్తున్న సామాజిక వేత్త రవీందర్..
- అధికారుల స్పందన కోసం ఎదురు చూడకుండా..
- సొంత ఖర్చుతో సూచిక బోర్డులు ఏర్పాటు చేసిన సామాజిక కార్యకర్త..
- ఇప్పటికైనా ట్రాఫిక్ మళ్ళిపుపై స్పష్టమైన సూచిక బోర్డుల ఏర్పాటుకు విజ్ఞప్తి..
- ముందస్తు సమాచారం లేక 2 కిలోమీటర్లు వెళ్లి వెనుదిరుగుతున్న వాహనాలు..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, అక్టోబర్ 3:** రహదారి విస్తరణ పనుల్లో భాగంగా, వాహన దారులను ముందుగానే అప్రమత్తం చేయాల్సిన కనీస హెచ్చరిక, సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం తీవ్ర విమర్శలు లేవనెత్తుతోంది.. రహదారి మూసివేత, ప్రత్యామ్నాయ మార్గం వంటి వివరాలను స్పష్టంగా తెలియజేయాల్సిన చోట ఎలాంటి ముందస్తు సమాచారం లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. ముఖ్యంగా భారీ వాహనాలు, లారీలు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు సైతం కొంతదూరం వెళ్లిన తర్వాత రహదారి పనులు కొనసాగుతున్న విషయం తెలుసుకుని తిరిగి వెనుదిరగాల్సిన పరిస్థితిపై ఓ సామాజిక వేత్త రెండు రోజులుగా దారి మళ్ళిపును వాహనదారులకు వివరించడం తోపాటు, సొంత ఖర్చులతో సూచిక బోర్డులను ఏర్పాటు చేయడం స్థానికంగా పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు.. కుత్బుల్లాపూర్ మండలం సూరారం ఎక్స్‌రోడ్ నుంచి విశ్వకర్మ కాలనీ మీదుగా మియాపూర్ వైవేకు చేరుకోవాలన్నా..! బౌరంపేట్, శంబిపూర్, ఐడీప బొల్లారం, వైపు వెళ్లే ఈ మార్గంలో సూరారం గ్రామం--విశ్వకర్మ కాలనీ ప్రాంతాన్ని దాటిన తర్వాత రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి..



రోడ్డు విస్తరణ కారణంగా దారి మళ్ళించారని వాహన దారులకు రవిందర్ ముదిరాజ్ సూచనలు..

# రోడ్డు విస్తరణ పనుల్లో..! నిబంధనలకు తిలోదకాలు..!

## సామాజిక బాధ్యతకు అభినందనలు..

తమకు ఎదురవుతున్న ఇబ్బందులను పక్కనపెట్టి.. ఇతర వాహనదారులకు ఇబ్బంది కలగకుండా, సామాజిక కార్యకర్త, రవీందర్ ముదిరాజ్ స్వచ్ఛందంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయడాన్ని స్థానికులు అభినందించారు.. ప్రజా భద్రత విషయంలో అధికారుల కోసం ఎదురుచూడకుండా సొంత ఖర్చుతో ముందుకొచ్చిన ఆయనను పలువురు ప్రశంసించారు.. రవిందర్ ముదిరాజ్ ఎన్నో ఏళ్ళ తరబడి, ఈ సేవా కార్యక్రమాలు చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే.. ముఖ్యంగా కరోణా సమయంలో బయటకు వెళ్లాలంటేనే, భయపడే సందర్భంలో, సోషల్, డిస్టెన్స్ కోసం, ప్రజలకు గొడుగులు పంపిణీ చేశారు, కరోణపై అవగాహన కార్యక్రమాలు, అధైర్య పడొద్దని సేవా కార్యక్రమాలు చేసిన సామాజిక వేత్త రవిందర్ ముదిరాజ్‌ను స్థానికులు అభినందించారు..ప్రజల నుండి వస్తున్న డిమాండ్, రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యే వరకు సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి, పనులు జరుగుతున్న ప్రాంతానికి ముందుగానే స్పష్టమైన సూచిక బోర్డులు, రహదారి మళ్లింపు బోర్డులు, బ్యారికేడ్లు ఏర్పాటు చేసి ప్రమాదాలకు తావులేకుండా చూడాలని కోరుతున్నారు..
ఈ కార్యక్రమంలో నాగేందర్, బాబు, నవీన్‌కుమార్, కార్తీక్, రాకేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## తాత్కాలిక మార్గం తెలిపే.. సూచిక బోర్డులేవి..?

అయితే రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యే ప్రాంతానికి, వాహనాలు వెళ్ళకుండా.. ముందస్తు చర్యలు చేపట్టక పోవడమే, ఈ సమస్యకు కారణమని సామాజిక వేత్త, పర్యావరణ ప్రేమికుడు కోలా రవిందర్ ముదిరాజ్ ఆరోపించారు.. సంబంధిత కాంట్రాక్టర్, అధికారులు ముందుగానే అనుసరించాల్సిన నిబంధనల్లో భాగంగా..'రోడ్డు పనులు జరుగుతున్నాయి'– 'రహదారి తాత్కాలికంగా మూసివేయబడింది'– 'ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లాలి'.. వంటి హెచ్చరిక, సూచిక బోర్డులు ఏర్పాటు చేయక పోవడంతో వాహనదారులు అయోమయానికి గురవుతున్నారని రవిందర్ ముదిరాజ్ తెలిపారు..

## రోడ్డు పనుల ముందస్తు సమాచారం ఉండాలి కదా..!

రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం ప్రజా రవాణా సౌకర్యాల, అభివృద్ధిలో భాగమే అయినప్పటికీ.. పనులు జరుగుతున్న సమయంలో ట్రాఫిక్ మళ్లింపు, ముందస్తు హెచ్చరికలు, భద్రతా ఏర్పాట్లు కూడా అంతే ముఖ్యమని స్థానికులు పేర్కొంటున్నారు.. పనులు చేపట్టే సంస్థతోపాటు సంబంధిత అధికారులు కూడా వాహనదారులకు ముందస్తు సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.. కాంట్రాక్టర్ రోడ్డు పనులపై దృష్టి పెట్టి, వాహనదారుల భద్రతకు సంబంధించిన సూచిక బోర్డులు ఏర్పాటు చేయడాన్ని విస్మరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.. ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించి.. పనుల ప్రాంతంలో అవసరమైన హెచ్చరిక బోర్డులు, బ్యారికేడ్లు, ప్రత్యామ్నాయ మార్గ సూచికలను తక్షణమే ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు..



రెండు కిలోమీటర్ల దూరంలో పనుల వద్ద బారీకేడ్ల ఏర్పాటుతో వాహన దారుల ఇబ్బందులు..







## సొంత ఖర్చుతో సామాజిక కార్యకర్త బోర్డులు ఏర్పాటు..

వాహనదారుల ఇబ్బందులను గమనించిన మాజీ లారీ యజమాని, నార్త్ రన్ సిటీ ఇసుక లారీల సంఘం మాజీ కార్యదర్శి, సామాజిక వేత్త--పర్యావరణ ప్రేమికుడు, ప్లాస్టిక్ నియంత్రణ, ఈతను పాఠ్యాంశంగా చేర్చాలనే పలు అంశాలపై, నిరంతర పోరాట యోధుడు, కోలా రవీందర్ ముదిరాజ్ స్పందించారు.. సంబంధిత అధికారులు, పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ నుంచి చర్యల కోసం ఎదురుచూడకుండా..రెండు రోజులుగా వాహన దారులకు ప్రత్యేకంగా సూచనలు చేస్తున్న రవిందర్ ముదిరాజ్, శనివారం ప్రజల భద్రత దృష్ట్యా తన సొంత ఖర్చుతో మూడు సూచిక బ్యానర్లను ఏర్పాటు చేశారు.. సూరారం చౌరస్తా నుంచి కట్టమైసమ్మ ఆలయం--బహదూర్‌పల్లి ఎక్స్‌రోడ్ చౌరస్తా వరకు వెళ్లి, అక్కడ ఎడమవైపుకు తిరిగి, బౌరంపేట్, ఐడీప బొల్లారం, బాచుపల్లి వైపు వెళ్లాలని వాహనదారులకు సూచిస్తూ ఈ బోర్డులను ఏర్పాటు చేశారు..




సూరారం ఎక్స్ రోడ్డులో సొంతంగా బ్యానర్ కట్టి ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్న రవిందర్ ముదిరాజ్..

## రెండు కిలోమీటర్లు వెళ్ళాకే.. అసలు విషయం..

రోడ్డు మూసివేత లేదా పనులు జరుగుతున్న విషయం ముందే తెలిసేలా సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు సుమారు రెండు కిలోమీటర్ల వరకు వెళ్లి.. అక్కడి నుంచి తిరిగి వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వాహనదారులు వాపోతున్నారు.. ముఖ్యంగా లారీలు, సరకు రవాణా వాహనాలు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు ఇలా అన్ని రకాల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు.. రోడ్డు పనులు నిర్వహించే సమయంలో వాహనదారుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉండగా, ముందస్తు హెచ్చరికలు లేకుండా పనులు కొనసాగించడం వల్ల ప్రమాదాలకు అవకాశం ఉంటుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. పనులు జరుగుతున్న ప్రాంతానికి ముందుగానే వాహనాలను మళ్లించేలా సూచికలు ఏర్పాటు చేయడం, రాత్రివేళల్లో కనిపించేలా రిఫ్లెక్టివ్ బోర్డులు, బ్యారికేడ్లు ఏర్పాటు చేయడం అవసరమని వాహనదారులు కోరుతున్నారు..

## సంతోషిమాత ఆలయాన్ని సందర్శించిన ఎంపీ ఈటల రాజేందర్..



హైదరాబాద్ పెన్ పవర్: దిల్‌సుఖ్‌నగర్‌లోని సంతోషిమాత ఆలయంలో అమ్మవారి విగ్రహంపై జరిగిన దాడి ఘటన నేపథ్యంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ శనివారం ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో పూజలు జరుగుతున్న సమయంలో ఓ వ్యక్తి పూజారిపై, అమ్మవారి విగ్రహంపై కర్రతో దాడికి పాల్పడిన ఘటనపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఆలయాలపై జరుగుతున్న ఘటనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని కోరారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలతో పాటు ఘటనకు దారితీసిన కారణాలను కూడా దర్యాప్తులో వెలికితీయాలని అన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు, కార్యకలాపాలపై నిఘా పెట్టాలని డిమాండ్ చేశారు. అన్ని మతాల ప్రజల ప్రార్థనా స్థలాలకు భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. హిందువుల సహనాన్ని పరీక్షించవద్దని, ఆలయాల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఈటల రాజేందర్ కోరారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్ఠం చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల భద్రతపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి..



హైదరాబాద్ పెన్ పవర్: దిల్‌సుఖ్‌నగర్‌లోని ప్రసిద్ధ సంతోషిమాత ఆలయంలో అమ్మవారి విగ్రహంపై దాడి ఘటనపై ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటన విషయం తెలుసుకున్న ఆయన ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయంలోకి ఓ వ్యక్తి ప్రవేశించి విగ్రహంపై దాడికి పాల్పడిన ఘటన సీసీటీవీ కెమెరాల్లో నమోదైందని తెలిపారు. పోలీసులు సమగ్ర దర్యాప్తు చేసి ఘటనకు గల కారణాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో గతంలో ముత్యాలమ్మ, చిట్టిముత్యాలమ్మ, సంతోషీమాత ఆలయాలకు సంబంధించిన ఘటనలు చోటుచేసుకున్నాయని ఆయన పేర్కొన్నారు. వరుస ఘటనల నేపథ్యంలో ఆలయాల వద్ద, ముఖ్యంగా అమ్మవారి ఆలయాల వద్ద భద్రతను పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ముద్ద కళ్యాణ్, చంద్రశేఖర్ ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్‌పై చెప్పుతో దాడి చేశారని ఆరోపణ..

బహుజన్ సమాజ్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి గ్యార మల్లేష్..




హైదరాబాద్ పెన్ పవర్: గుంతపల్లి గ్రామంలో ఉప సర్పంచ్ కరిమెల నర్సింగ్‌రావుపై సర్పంచ్ అంతటి హేమలత గౌడ్, ఆమె కుటుంబ సభ్యులు చెప్పుతో దాడి చేశారని బహుజన్ సమాజ్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి గ్యార మల్లేష్ ఆరోపించారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన అనంతరం పంచాయతీ ఆవరణలో ఈ ఘటన చోటుచేసుకుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులం పేరుతో దూషిస్తూ నర్సింగ్‌రావును అవమానించారని ఆరోపించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, సర్పంచ్‌ను వెంటనే అరెస్ట్ చేసి పదవి నుంచి తొలగించాలని బీఎస్పీ తరఫున డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కమిటీ తరఫున ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా ఈసీ మెంబర్ చిత్రం కృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్ యంజాల ప్రహ్లాద్, వార్డు సభ్యులు అంతటి బాలకృష్ణ గౌడ్, కరిమెల శ్రీనివాస్, పోచయ్య, రవి, శంకరయ్య, భాస్కర్, చిత్రం బాల్‌రాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్బీ స్టేడియంలో ఘనంగా 157వ గాంధీ జయంతి వేడుకలు..






హాజరైన మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ విద్యార్థులు..

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 157వ గాంధీ జయంతి ఉత్సవాలు ఎల్బీ స్టేడియంలో అంగరంగ వైభవంగా జరిగాయి. టీపీసీసీ, గాంధీ జ్ఞాన సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహేశ్వరం విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సంగి రమేశ్ ఆదేశాల మేరకు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జహీదా బేగం ఆధ్వర్యంలో 125 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గాంధీజీకి ఇష్టమైన ఖాదీని ప్రతిబింబించేలా విద్యార్థినులు ప్రత్యేక ఖాదీ చీరలు ధరించి 1,157 చరకాల ప్రదర్శనలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు ముఖేష్ గౌడ్‌తో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. వివిధ పాఠశాలలకు చెందిన 1,157 మంది విద్యార్థులు 'చిన్నారి గాంధీ' వేషధారణలో పాల్గొని ఆకట్టుకున్నారు. వివిధ డిగ్రీ కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పెద్ద సంఖ్యలో హాజరై చరకాల ప్రదర్శనలో భాగస్వాములయ్యారు. గాంధీజీ సిద్ధాంతాలు, ఖాదీ ప్రాధాన్యతను చాటిచెప్పేలా నిర్వహించిన ఈ కార్యక్రమం సందడిగా సాగింది. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

## ఎన్ని మాధ్యమాలున్నా పుస్తకం విలువ తగ్గదు




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగుదనాన్ని, మాతృభాషను కాపాడుకోవడానికి తెలుగువారంతా కంకణబద్ధులు కావాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. ఎన్ని మాధ్యమాలు ఉన్నా పుస్తకం విలువ తగ్గదని, అందులో జీవనం, లోతైన సత్యం ఉంటాయన్నారు. పూర్వీకులు అందించిన విజ్ఞానం, సంస్కృతీ సంప్రదాయాలు, వారసత్వాన్ని నిలుపుకొందామన్నారు. కస్తూరి విజయం పబ్లికేషన్ సంస్థ వ్యవస్థాపకులు పామిరెడ్డి సుధీర్‌రెడ్డి, పద్మజ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో 'ఇంటర్నేషనల్ ఇంక్‌బౌండ్ 2.0' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో.. ఎన్నారై వంగూరి చిట్టెన్‌రాజు రచించిన 'అవేమైనా జ్ఞాపకాలా.. మర్చిపోవడానికి?', డా.ప్రవీణ్ యజ్జల రచించిన 'స్క్రీన్‌ప్లే మాస్టర్ – సుకుమార్', ఇతర రచయితల 'అమ్మమ్మ కథల ఖజానా', 'గ్రాండ్‌మా గోల్డెన్ టేల్స్' పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ముఖ్యఅతిథిగా హాజరైన ఎం.వెంకయ్యనాయుడు.. సాహితీవేత్త యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, కవి, నటుడు తనికెళ్ల భరణి తదితరులతో కలిసి ఆయా పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ ఆంగ్ల భాష మాత్రమే గొప్పదనే మనస్తత్వం నుంచి బయటపడాలన్నారు. జీవనం యాంత్రికంగా మారిన ఈ రోజుల్లో సుందరమైన జ్ఞాపకాలను, మానవ సంబంధాల మాధుర్యాన్ని వంగూరి చిట్టెన్ రాజు పుస్తకరూపంలో అందించారని అభినందించారు. 'స్క్రీన్‌ప్లే మాస్టర్ – సుకుమార్' పుస్తకాన్ని తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. కుటుంబమంతా కలిసి చూసే 'పాతాళభైరవి', 'మాయాబజార్', 'మిస్సమ్మ' వంటి సినిమాలేవని ప్రశ్నించారు. తాను సినిమాను విమర్శించడం లేదని, కేవలం ధోరణి గురించి మాట్లాడుతున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో రచయిత వంశీ రామరాజు, అమెరికాకు చెందిన శ్రీనివాసరావు సహా వివిధ రంగాల ప్రముఖులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

## అత్యవసర సమయంలో సుధీర్‌బాబుకు రక్తం అందించిన చేపూరి శంకర్..



హైదరాబాద్ పెన్ పవర్: అత్యవసర సమయంలో రక్తం అవసరమైన ఓ రోగికి మానవతా దృక్పథంతో రక్తాన్ని సమకూర్చి మదర్ తెరిసా చారిటబుల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు చేపూరి శంకర్ తన సేవా గుణాన్ని చాటుకున్నారు. మల్కాజిగిరి జిల్లా సూరారం మాలిగాలాకు చెందిన సుధీర్‌బాబు నీలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్లేట్లెట్ల సంఖ్య తగ్గడంతో అత్యవసరంగా రక్తం అవసరమైంది. విషయం తెలుసుకున్న చేపూరి శంకర్ స్పందించి కేవలం 20 నిమిషాల్లో రక్తాన్ని సమకూర్చారు. విద్యానగర్ బ్లడ్ బ్యాంక్, రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో అవసరమైన రక్త ప్యాకెట్లను ఉచితంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందించి సుధీర్‌బాబుకు అండగా నిలిచారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ 'మానవసేవే మాధవసేవ' అని అన్నారు. రక్తం అవసరమైన వారికి సకాలంలో సహాయం అందించేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న పలువురి ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు.

## ఎల్ నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడిన నేపథ్యంలో రైతులు యాసంగిలో తక్కువ నీటితో పండే పంటలు వేయాలి



రైతు నేస్తంలో మంత్రి తుమ్మల నాగేశ్వరావు.

హైదరాబాద్ పెన్ పవర్: ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడిన నేపథ్యంలో రైతులు యాసంగిలో స్వల్పకాలికంగా పండే, తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడినిచ్చే పంటల వైపు మళ్లాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు సూచించారు.రైతు నేస్తం 109వ ఎపిసోడ్‌లో భాగంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉన్న పప్పుధాన్యాలు, నూనెగింజల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. నీటి లభ్యత ఆధారంగా ప్రణాళికలు రూపొందించి రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా బయ్యారం రైతు వేదికలోని వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ ద్వారా మండల వ్యవసాయ అధికారి కే. రాజు ఆధ్వర్యంలో రైతులు మంత్రి ప్రసంగాన్ని వీక్షించారు.ఈ కార్యక్రమంలో బయ్యారం ప్యాక్స్ చైర్మన్ బండారి మల్లయ్య,బాలాజీపేట సర్పంచ్ మాలోత్ పార్వతి,ఆత్మా కమిటీ సభ్యుడు ఎన్.అమృత రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

?రైతు నేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రతి మంగళవారం ఉదయం 10:00 గంటల నుండి 11:30 గంటల వరకు బయ్యారం కొత్తపేట రైతు వేదికలలో 'రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి కే.రాజు తెలిపారు.

## నాటుసారా,బెల్లం పానకం స్వాధీనం.



హైదరాబాద్ పెన్ పవర్: బయ్యారం పోలీస్ స్టేషన్ పరిధిలోని జగ్న తండాలో శనివారం బయ్యారం సీఐ లోడిగ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత కార్డన్ సెర్చ్ నిర్వహించారు.ఉదయం 9 గంటల సమయంలో ఎస్సైలు సాయి కుమార్, టి.ప్రశాంత్ బాబు,పోలీస్ సిబ్బందితో కలిసి గ్రామంలో తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 6 లీటర్ల నాటుసారా,200 లీటర్ల బెల్లం పానకాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్న జగన్ తండాకు చెందిన కాశీరాం,హచ్చా అనే ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.ఈ సందర్భంగా సీఐ లోడిగ రవీందర్ గ్రామ ప్రజలతో మాట్లాడారు.నాటుసారా, గుడుంబా, గంజాయి వంటి మాదకద్రవ్యాలు ఆరోగ్యానికి హానికరమని, అలాంటి చట్టవిరుద్ధ పనులకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.?అలాగే పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద ఆన్‌లైన్ లింకుల విషయంలో జాగ్రత్త వహించాలని అవగాహన కల్పించారు. సైబర్ మోసాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో అక్రమ మద్యం, గంజాయి నిరోధానికి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## విశ్వనాథపురంలో ఫుడ్ మార్కెట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి



హైదరాబాద్ పెన్ పవర్: గీసుగొండ మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో ఫుడ్ మార్కెట్ ఏర్పాటు చేయడానికి అనుకూలమైన ప్రాంతాన్ని , వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఏ. ప్రియాంక అనిల్ తో కలిసి పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు.రైతులు, వ్యాపారులు, స్థానిక ప్రజలకు ప్రయోజనం కలిగే విధంగా ఫుడ్ మార్కెట్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, రవాణా సౌకర్యాలు, మార్కెటింగ్ వసతులు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు.ఫుడ్ మార్కెట్ ఏర్పాటు ద్వారా ఈ ప్రాంత రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు అందడంతో పాటు, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడం, వ్యాపార కార్యకలాపాలకు మరింత ప్రోత్సాహం లభించే అవకాశం ఉందని అన్నారు.

# ఖైరతాబాద్ బరిలో కవిత పార్టీ

**హైదరాబాద్, అక్టోబరు 3 పెన్ పవర్:**
ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ వైపు అడుగులు వేసి ఎంపీగా పోటీ చేయడంతో ముంచుకొచ్చిన ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నిక తెలంగాణ రాజకీయాల్లో ఊహించని మలుపులు తిరుగుతోంది. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చి, తెలంగాణ రక్షణ సేన పేరుతో కొత్త రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన కల్వకుంట్ల కవిత.. ఈ ఉపఎన్నిక బరిలో తమ పార్టీ అభ్యర్థిని దించుతామని ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ ఆవిర్భావం తర్వాత ఎదుర్కొంటున్న తొలి ఎన్నిక కావడంతో, ఖైరతాబాద్ పోరు తెలంగాణ రక్షణ సేనకు తమ ఉనికిని, క్షేత్రస్థాయి ప్రాభవాన్ని చాటుకునే ప్రతిష్టాత్మక పరీక్షగా మారనుంది. ఈ ఎన్నికల్లో కవిత నేతృత్వంలోని పార్టీకి ప్రధాన లక్ష్యం తక్షణమే సీటును కైవసం చేసుకోవడం కాకపోవచ్చు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల త్రిముఖ పోటీ మధ్య తమకంటూ ఒక ప్రత్యేకమైన ఓటు బ్యాంకు, సిద్ధాంతపరమైన స్థానం ఉందని నిరూపించుకోవడమే ఆమె అసలైన పొలిటికల్ ఎజెండాగా కనిపిస్తోంది. బిఆర్ఎస్ నుంచి సస్పెన్షన్, జైలు జీవితం తర్వాత "సామాజిక తెలంగాణ" నినాదంతో ప్రజాక్షేత్రంలోకి వచ్చిన కవితకు.. హైదరాబాద్ నడిబొడ్డున జరిగే ఈ బైపోల్ ఒక లిట్మస్ టెస్ట్ లాంటిది. ప్రధాన పార్టీలకు గట్టి పోటీ ఇస్తూ ఓట్లను రాబట్టగలిగితే, రాబోయే స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికలకు టీఆర్ఎస్‌ను ఒక ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టే అవకాశం దక్కుతుంది. ఖైరతాబాద్ నియోజకవర్గ భౌగోళిక, సామాజిక సమీకరణాలు పరిశీలిస్తే ఇక్కడ పోటీ అత్యంత విలక్షణంగా ఉంటుంది. బస్తీల్లో ఉండే శ్రామిక వర్గాలు, కాలనీల్లోని మధ్యతరగతి ప్రజలు, హైటెక్ ఉద్యోగులు, ఐటీ ఆధారిత వ్యాపారవేత్తలు, విద్యావంతులు పెద్ద సంఖ్యలో ఇక్కడ నివసిస్తున్నారు. స్థానికంగా మంచి పట్టుండి, ప్రజాదరణ పొందిన బలమైన అభ్యర్థిని బరిలోకి దించగలిగితే తెలంగాణ రక్షణ సేన ప్రధాన పార్టీల గెలుపోటములను ప్రభావితం చేసే కింగ్ మేకర్ గా మారే ప్రభావం చూపుతుంది. ఈ ఉపఎన్నికలో కవితకు అతిపెద్ద ప్లస్ పాయింట్ మహిళా ఓటర్లు. గతంలో తెలంగాణ జాగృతి ద్వారా బతుకమ్మ సంస్కృతిని విశ్వవ్యాప్తం చేయడం, మహిళా సాధికారత అంశాలపై పోరాడటం వల్ల తెలంగాణ సెంటిమెంట్‌తో పాటు



మహిళల్లో ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఖైరతాబాద్ వంటి అర్బన్ నియోజకవర్గంలో మహిళా ఓటర్ల శాతం అధికంగా ఉండటం వల్ల.. ధరల పెరుగుదల, ఉచిత బస్సు ప్రయాణాల అమలు తీరు, మహిళా భద్రత, స్థానిక సమస్యలపై ఆమె చేసే ప్రచారం మహిళల ఓట్లను ఆకర్షించే అవకాశం ఉంది. ఇది అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌ల సాంప్రదాయ మహిళా ఓటు బ్యాంకుకు గండికొట్టడం ఖాయంగా కనిపిస్తోంది. దానం నాగేందర్ పార్టీ మార్పు , రాజ్యాంగబద్ధమైన పదవుల దుర్వినియోగంపై కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఒక గుర్తుపై గెలిచి మరొక పార్టీకి వెళ్లడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమే అని ప్రజల్లోకి తీసుకెళ్తూ, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, బీఆర్ఎస్ అంతర్గత ఒప్పందాలను ఒకేసారి ఎండగట్టే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. రాజధాని నగరంలోని విద్యావంతులు, తటస్థ ఓటర్లు ప్రజాస్వామ్య సూత్రాలకు ప్రాధాన్యమిస్తే.. ఈ రాజకీయం
కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండింటికీ తలనొప్పిగా మారనుంది. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఫలితాల సరళిని తలకిందులు చేసే శక్తి తెలంగాణ రక్షణ సేనకు ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గెలుపు ఓటముల కంటే కూడా, తాము సాధించే ఓట్ల శాతమే భవిష్యత్తులో తెలంగాణ రాజకీయాల్లో కవిత ఎంతవరకు ప్రభావం చూపగలరనే దానికి ప్రామాణికంగా నిలుస్తుంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు సైతం కవిత అభ్యర్థిత్వం , వ్యూహాలను తేలిగ్గా తీసుకోలేక, తమ ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు కొత్త సమీకరణాలను తెరపైకి తెచ్చే పరిస్థితి ఏర్పడింది.

# సెల్ఫ్ గోల్ రాజకీయంతో రేవంత్



**హైదరాబాద్, అక్టోబరు 3 పెన్ పవర్:**
కాంగ్రెస్ పార్టీ మత రాజకీయాలను సరికొత్త కోణంలో ప్రమాదకరమైన ప్రయోగానికి తెరలేపింది. భారతీయ జనతా పార్టీ సుదీర్ఘకాలంగా నిర్మించుకుంటూ వస్తున్న హిందుత్వ ఓటు బ్యాంకుకు విరుగుడు కనిపెట్టే ఆత్రుతలో కాంగ్రెస్ నాయకత్వం సరికొత్త వివాదాలకు ఆజ్యం పోస్తోంది. గతంలో పార్లమెంట్‌లో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ భగవాన్ శివుడి చిత్రాన్ని ప్రదర్శిస్తూ ప్రసంగించిన బాటలోనే.. తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వేదికగా ఆర్య-ద్రావిడ వాదాన్ని, శైవం-వైష్ణవం పేరిట దేవుళ్లకే వర్గ విభజన ఆపాదిస్తూ చేసిన వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. రాముడు ధనికుల దేవుడు-శివుడు పేదల దేవుడు.. ఉత్తరాది వారు ఆర్యులు, దేవుడిగా రాముడిని కొలిస్తే.. దక్షిణాది వారమైన మేము ద్రావిడులం, శివుడిని ఆరాధిస్తాం.. బీజేపీ రాముడిని హైజాక్ చేసింది అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపాయి. ఒక రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి, హిందూ దైవ కుటుంబంలో అత్యంత ప్రధానమైన శ్రీరాముడు, పరమశివుడి మధ్య పేద, ధనిక అంతరాలను సృష్టించడం విపరీతమైన విమర్శలకు దారితీసింది. ప్రాంతీయంగా ద్రావిడ వాదాన్ని ఎత్తుకుంటూనే, దైవ భావనకు కూడా వర్గ పోరాటం రంగు పులమడం కాంగ్రెస్ అనుసరిస్తున్న నూతన రాజకీయ విభజన వ్యూహానికి నిదర్శనమని భావిస్తున్నారు. హిందూ సమాజంలో చారిత్రకంగా అనేక సంప్రదాయాలు ఉన్నప్పటికీ, రాముడు, శివుడు అనే వ్యత్యాసాలు లేకుండా హరిహరులు గా కలిసి ఆరాధించే సంస్కృతి భారత్‌లో ఉంది. ముఖ్యంగా తెలంగాణలోనే భద్రాచలం శ్రీరాముడిని దక్షిణ అయోధ్య గా, వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దక్షిణ కాశీ గా సమానంగా పూజిస్తారు. ఇటువంటి పుణ్యక్షేత్రాలు ఉన్న ప్రాంతానికి చెందిన నేతలే.. రాజకీయ ప్రయోజనాల కోసం దేవుళ్లను ఉత్తర-దక్షిణ భాగాలుగా, ధనిక-పేద వర్గాలుగా విభజించడం వెనుక క్షేత్రస్థాయిలో రాజకీయ లబ్ధి పొందాలనే ఆరాటం స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా హిందూ సంప్రదాయాలను విభజించడం ద్వారా బీజేపీ ఏకీకృత హిందూ ఓటు బ్యాంకును దెబ్బతీయవచ్చని అంచనా వేస్తోంది. వ్యూహాత్మకంగా కాంగ్రెస్ వేస్తున్న ఈ అడుగులు ఆ పార్టీకే రివర్స్ అయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ఇటువంటి భక్తి, విశ్వాసాల కేంద్రంగా జరిగే విభజన రాజకీయాలు ఆఖరికి బీజేపీకే రాజకీయంగా అత్యధిక ప్రయోజనాన్ని చేకూరుస్తాయి. హిందూ దేవుళ్లను రాజకీయాల్లోకి లాగి, వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా మెజారిటీ ఓటర్లలో కాంగ్రెస్‌పై ప్రతికూల భావన ఏర్పడేలా చేయడం బీజేపీకి చాలా సులభమవుతుంది. ఈ వ్యాఖ్యలను అస్త్రంగా చేసుకుని కాంగ్రెస్ హిందూ వ్యతిరేక సిద్ధాంతాన్ని,
నకిలీ సెక్యులరిజాన్ని పాటిస్తోంది అని బీజేపీ విస్తృతంగా ప్రచారం చేయడానికి అవకాశం లభిస్తుంది. హిందూత్వను నేరుగా ఎదుర్కోలేక, దానిని ముక్కలు చేసేందుకు శివుడు జం రాముడు, ఉత్తరాది జం దక్షిణాది సమీకరణాలు తేవడం వల్ల పోలరైజేషన్ జరుగుతుంది. ఇది కాంగ్రెస్‌కు ఉన్న లౌకిక లేదా తటస్థ ఓటర్లను కూడా దూరం చేసే ప్రమాదం ఉంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తన ప్రాచీన ధార్మిక క్షేత్రాల పునర్నిర్మాణం ద్వారా ఇప్పటికే ఉత్తర-దక్షిణ తేడా లేకుండా విశ్వాసులలో స్థానం సంపాదించుకుంది. కాబట్టి దేవుళ్లను విభజించే యత్నం సాధారణ భక్తుల్లో ఆగ్రహాన్ని కలిగించి, ఓట్ల రూపంలో బీజేపీ వైపే దారితీస్తుందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ హిందూత్వ సిద్ధాంతానికి విరుగుడుగా తెస్తున్న ఈ విభజన కౌంటర్ వ్యూహం సెల్ఫ్ గోల్ అయ్యే అవకాశాలే ఎక్కువ. విశ్వాసాలను రాజకీయం చేసి, దేవుళ్లకు వర్గ భేదాలు ఆపాదించడం ద్వారా కాంగ్రెస్ సాధించేదనకంటే కోల్పోయేదే ఎక్కువని తెలంగాణ రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. భావజాల పరంగా స్పష్టమైన ప్రత్యామ్నాయాన్ని ప్రజల ముందు ఉంచకుండా, ఇటువంటి సున్నితమైన అంశాలను కెలికితే అది బీజేపీ నేతృత్వంలోని పొలరైజేషన్ వ్యూహానికి మరింత నెయ్యి పోసినట్లే అవుతుందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.

# ఫాం హౌస్ సర్వేపై ఉత్కంఠ

**హైదరాబాద్, అక్టోబరు 3, పెన్ పవర్:**
కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్ భూముల అంశం కేంద్రబిందువుగా మారింది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, వెలికట్ట గ్రామాల పరిధిలో కేసీఆర్ ఫాంహౌస్‌ను ఆనుకుని ఉన్న భూముల సర్వే ప్రక్రియ పూర్తికావడం చర్చనీయాంశమైంది. రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన ఈ సమగ్ర సర్వే నివేదిక సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతికి చేరింది. దీంతో.. ప్రభుత్వం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోబోతుందనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.
కేసీఆర్ ఫాంహౌస్ లో అసైన్డ్ ల్యాండ్స్ ఉన్నాయని.. వాటిపై 30 రోజుల్లోగా సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఆదేశించారు. మర్కూక్ మండల పరిధిలోని భూముల లెక్కలు తేల్చాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగం కదిలింది. ఎర్రవల్లి సర్వే నంబర్ 325 పరిధిలోని సుమారు 388 ఎకరాలు, వెలికట్ట సర్వే నంబర్ 271 భూములపై అధికారులు సర్వే నిర్వహించారు. శాటిలైట్ మ్యాపింగ్, జియో ట్యాగింగ్, డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సర్వే వంటి ఆధునిక పద్ధతులను ఉపయోగించి హద్దులను నిర్ధారించారు. ఈ సర్వేలో భాగంగా ఎర్రవల్లిలో 244 మందికి, వెలికట్టలో 118 మందికి పైగా నోటీసులు జారీ చేసి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. ఈ సర్వే రాజకీయంగానే కాకుండా స్థానికంగానూ అనేక మలుపులు తిరుగుతోంది. ముఖ్యంగా శివారు వెంకటాపూర్ గ్రామస్థులు అధికారుల ముందుకొచ్చారు. తమ గ్రామానికి చెందిన సుమారు 180 ఎకరాల భూములు ఎర్రవల్లి సర్వే నంబర్ 325లో కలిసిపోయాయని, పాత రికార్డుల ఆధారంగా న్యాయం చేయాలని వారు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. మరోవైపు, దశాబ్దాలుగా ఆ భూములను సాగు చేసుకుంటున్న చిన్న సన్నకారు రైతులు తమ పట్టా పాస్‌బుక్కులు చూపించినప్పటికీ, ప్రభుత్వ తాజా నిర్ణయాలు తమను ఏ విధంగా ప్రభావితం చేస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. పదేళ్లపాటు సీఎంగా ఉన్న కేసీఆర్ ఫాంహౌస్ చుట్టూ ఉన్న భూముల్లో ప్రభుత్వ, అసైన్డ్ భూములు అన్యాక్రాంతమయ్యాయని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఒకవేళ ఈ సర్వే నివేదికలో భూ ఆక్రమణలు జరిగినట్లు లేదా నిబంధనలకు విరుద్ధంగా భూ బదలాయింపులు జరిగినట్లు తేలితే, అది కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్‌ను ఇరుకున పెట్టే అవకాశం ఉంది. అధికార కాంగ్రెస్ పార్టీ దీనిని రాజకీయ అస్త్రంగా మలుచుకుంటుంది. అయితే రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఈ సర్వే చేపట్టారని గులాబీ శ్రేణులు మండిపడుతున్నాయి. కలెక్టర్ అందజేయనున్న ఈ తుది నివేదికను ప్రభుత్వం పరిశీలించి ఎలాంటి చర్యలకు ఉపక్రమిస్తుందనేది ఆసక్తి రేపుతోంది. కేసీఆర్ కు నోటీసులు జారీ చేసి విచారణకు పిలిచే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఒకవేళ అదే జరిగితే రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు మరో మలుపు తిరిగే అవకాశముంది.

## హనుమంతుడే కాపాడాడు

**హైదరాబాద్, అక్టోబరు 3, పెన్ పవర్:** దుబాయ్ విమానంలో జరిగిన హింసాత్మక ఘటనలో వీరోచితంగా పోరాడి, గాయపడిన భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్ ను ప్రధాని మోదీ ఫోన్లో పరామర్శించారు. యూఏఈలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మచ్చర్ తో మోదీ వీడియో కాల్ లో మాట్లాడారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కాక్ పిట్ లో తనకు ఎదురైన పరిస్థితిని మచ్చర్ ప్రధాని మోదీకి వివరించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో చూపించిన సమయ స్ఫూర్తి, ధైర్యం అభినందనీయం. మీ ప్రాణం కంటే ప్రయాణికుల భద్రత కోసం పోరాడిన మీరు ఎందరికో స్ఫూర్తిదాయకం. త్వరగా కోలుకోవాలని యావత్ భారత్ ప్రార్థిస్తోంది. భారతీయులు ఇతరుల ప్రాణాలు తీసేవారు కాదు. ఇతరులను రక్షించడం కోసం తమ ప్రాణాలను కూడా ఫణంగా పెట్టడానికి సిద్ధపడతారని మన దేశం ఇప్పుడు గర్వంగా చెప్పుకుంటుంది" అని స్మిత్ తో మోదీ అన్నారు. మరో వైపు ప్రధాని మోదీయే నేరుగా ఫోన్ చేయడంపై కెప్టెన్ స్మిత్ మచ్చర్ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా మచ్చర్ మాట్లాడుతూ "మీరు నాకు అత్యంత ఆరాధనీయులు. మీ నుంచి ఫోన్ రావడం గర్వంగా వుంది. కలలో కూడా నేను ఊహించలేదు. అనుకోని పరిస్థితులు, విపత్కర పరిస్థితుల్లో హనుమాన్ చాలీసా పఠిస్తా. కాక్ పిట్ లో ఘర్షణ సమయంలోనూ హనుమాన్ చాలీసాయే పఠించా. ఆ సమయంలో నేను గాయపడినా, ఆలోచించలేదు. ఎవరి ప్రాణాలూ పోవద్దని మాత్రం దేవుడ్ని ప్రార్థించా. నేను ఎలాగైనా లేవాలి. లేదంటే నాతో పాటు అందరూ మరణిస్తారని గట్టిగా భావించా" అంటూ మోదీకి వివరించారు.

## ప్రజల ఆస్తులకు రక్షణ..
## చెంచుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడంతో పాటు చెంచు గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. శుక్రవారం ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామంలో రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆత్మకూరు మండల ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఐటీడీఏ ఆధ్వర్యంలో చెంచు గిరిజన ఉద్యానవన రైతులకు పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పారదర్శకంగా సర్వే నిర్వహించి ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలను అందిస్తున్నామని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించిందన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. వెంకటాపురం, బైర్లూటి, కృష్ణాపురం, అమలాపురం, శ్రీపతిరావుపేట, ఇందిరేశ్వరం గ్రామాల్లోని సుమారు 5 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.30 కోట్లతో శ్రీ బుడ్డా వెంగళరెడ్డి సిద్ధాపురం ఎత్తిపోతల పథకం నుంచి నీటిని అందించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని వెల్లడించారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నామని తెలిపారు. చెంచు గిరిజన రైతులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయం, ఉద్యానవన రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. ప్రతి చెంచు కుటుంబానికి పక్కా ఇళ్లు అందించేందుకు కృషి చేస్తున్నామని, గూడేల్లో మౌలిక వసతులతో పాటు విద్య, వైద్య సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. చెంచుల అభివృద్ధి కోసం దేశంలోనే తొలిసారిగా ఐటీడీఏను ఏర్పాటు చేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకు దక్కుతుందని బుడ్డా రాజశేఖర రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు మండలాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపేందుకు అధిక నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

## దిల్‌సుఖ్‌నగర్ సంతోషిమాత ఆలయంలో సంప్రోక్షణ

**హైదరాబాద్ పెన్ పవర్:**
నిన్న ఉదయం అమ్మవారి విగ్రహంపై అనుచితంగా ప్రవర్తించిన ఘటన నేపథ్యంలో దిల్‌సుఖ్‌నగర్ సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్పగిరి పీఠాధిపతి స్వాముల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల మధ్య అమ్మవారి విగ్రహానికి శాస్త్రోక్తంగా సంప్రోక్షణ నిర్వహించారు.

## సంతోషి మాత ఆలయాన్ని సందర్శించిన మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఎంపి ఈటల రాజేందర్ శనివారం నాడు దిల్ షుక్ నగర్ లోని సంతోషి మాత ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో విగ్రహంపై జరిగిన దాడిని ఈటల రాజేందర్ తీవ్రంగా తప్పుబట్టారు. "అమ్మవారి కిరీటంపై కర్రతో కొట్టే పద్ధతికి నేను వ్యతిరేకం" అని నిందితుడు చెప్పినట్లు ఈటల వ్యాఖ్యానించారు. ఆలయంపై జరిగిన దాడి ఇదే మొదటిది కాదని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు హిందువుల మనోభావాలు, విశ్వాసాలను దెబ్బతీస్తున్నాయని ఈటల అన్నారు. ధార్మిక వేదికల్లో జరిగే ప్రసంగాల ప్రభావంపై కూడా ఆలోచించాల్సిన అవసరం ఉందని ఈటల వ్యాఖ్యానించారు.

## హిందూ సంఘాలు - పోలీసుల మధ్య తీవ్ర ఉద్రిక్తత

**హైదరాబాద్ పెన్ పవర్:** దిల్‌సుఖ్‌నగర్ సంతోషిమాత ఆలయంలో అమ్మవారి విగ్రహంపై అనుచితంగా ప్రవర్తించిన ఘటన నేపథ్యంలో హిందూ సంఘాలు, పోలీసుల మధ్య తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఘటనపై పోలీసులు సరైన స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదంటూ హిందూ సంఘాల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆలయ పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని హిందూ సంఘాల ప్రతినిధులు పోలీసులను డిమాండ్ చేశారు.
మరోవైపు పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి ఆందోళనకారులను సముదాయించే ప్రయత్నం చేశారు.

## అనంతగిరి వద్ద లోయలో పడిపోయిన ప్రైవేట్ బస్సు
## ముగ్గురు మృతి, 20 మందికి పైగా గాయాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** :ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లింది. వికారాబాద్ జిల్లా యాచారం నుంచి బానూరు వెళ్తుండగా ఘటన జరిగింది. బస్సు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందినట్లు వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మేహ్రా తెలిపారు. సిరియస్ ఉన్న క్షతగాత్రులను వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికే కాకుండా చుట్టుపక్కల ఉన్న తాండూరు చేవెళ్ల కూడా తరలించినట్లు అధికారులు తెలిపారు సంఘటన స్థలాన్ని వికారాబాద్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్,ఫైర్ సిబ్బంది పోలీసు కలిసి సంఘటన చేరుకొని క్షతగర్తులను ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు.

## మెడికవర్ ఆసుపత్రిలో రేవంత్ రెడ్డి పెట్టుబడులు

**హైదరాబాద్ పెన్ పవర్:** :రేవంత్ రెడ్డి మెడికవర్ ఆసుపత్రిలో దుంప శిరీష పేరిట బినామీ పెట్టుబడులు పెట్టి 13 వేల కోట్ల కు ఆసుపత్రిని అమ్మేశారని బీఆర్ఎస్ నేత మన్నే క్రిశాంక్ అన్నారు
మాక్స్ బీన్ ఫార్మా కంపెనీలో ప్రధాన డైరెక్టర్లు రేవంత్ రెడ్డి అల్లుడు సత్యనారాయణ మరియు దుంప శిరీష అనే మహిళ. మెడికవర్ ఆసుపత్రిలో కూడా ప్రధాన షేర్హోల్డర్ దుంప శిరీష. సహృదయ మాతృ సంస్థ ద్వారా మెడికవర్ ఆసుపత్రి నిర్మించారు. గత రెండేళ్లుగా సహృదయ మాతృ సంస్థ ఆదాయం 689% పెరిగింది. అయితే ఈ మెడికవర్ ఆసుపత్రిని రూ.13,300 కోట్లకు అమ్మేశారు.. రెండేళ్లలో అంత ఆదాయం ఎలా పెరిగిందని అయన ప్రశ్నించారు.
రేవంత్ రెడ్డి కూతురు నైమిష నిర్మిస్తున్న స్కూల్లో కూడా ఈ దుంప శిరీష పార్ట్నర్గా ఉంది. ఆ స్కూల్లో డైరెక్టర్లు దుంప శిరీష, అనుముల నైమిష రెడ్డిలు, గీతా ఆటోమోటివ్ లో కుడా ఉన్నారని క్రిశాంక్ అన్నారు.

# అమెరికాలో విషాదం.. అనారోగ్యంతో నల్గొండ యువతి మృతి

**మిర్యాలగూడ పెన్ పవర్:** ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన తెలుగు యువతి తీవ్ర అనారోగ్యానికి గురై దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందింది. క్యాన్సర్ మహమ్మారితో పోరాడి కన్నుమూసింది. నల్గొండ జిల్లావేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామానికి చెందిన బాధితురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పీఏసీఎస్ సల్కునూరు మాజీ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి కందిమల్ల
లక్ష్మిరెడ్డి, పద్మ దంపతుల చిన్న కుమార్తె మాన్విత రెడ్డి (26) హైదరాబాద్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. ఉన్నత చదువుల కోసం 2023లో అమెరికా వెళ్లింది. స్నేహితులతో కలిసి ఉంటూ ఎంఎస్‌పూర్తి చేసింది. ఈ క్రమంలో ఆమె అనారోగ్యానికి గురైంది. సెప్టెంబర్ 4న అకస్మాత్తుగా తీవ్ర గొంతు నొప్పితో అనారోగ్యానికి గురికావడంతో స్నేహితులు ఆమెను బాల్టిమోర్‌లోని దవాఖానలో చేర్పించారు. వైద్య
పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమెకు నాలుగో దశ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారించారు. సెప్టెంబర్ 13న చికిత్స కోసం దవాఖానలో ఇన్ పేషెంట్‌గా చేర్చుకున్నారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్సపొందుతుంది. ఈ క్రమంలో ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అక్టోబర్ 1న మాన్వితారెడ్డి మృతిచెందింది.

## ఇద్దరు పిల్లలతో కలిసి బావిలో దూకి తల్లి ఆత్మహత్య

## వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలో విషాద ఘటన

**హైదరాబాద్ పెన్ పవర్:**
మాటుగూడలో కుటుంబ కలహాల నేపథ్యంలో శుక్రవారం ఉదయం భర్త రాజుతో గొడవ పడి కూతురు జనశ్రీ (8), కుమారుడు సాకేత్ (4)లను తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయి సోమనుర్తి శివారులోని
వ్యవసాయ బావిలో దూకి శవమై భార్య మమత (30) కనిపించింది. ఇద్దరి మృతదేహాలను బయటకు తీయగా, సాకేత్ కోసం పోలీసులు గాలిస్తునవారు.

## శ్రీసిటీలో ఘోర ప్రమాదం.. నలుగురు మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** తిరుపతి తిరుపతి జిల్లా శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో శనివారం భారీ పేలుడు సంభవించింది. టిల్ హెల్త్కేర్ పరిశ్రమలో బాయిలర్ ఒక్కసారిగా పేలడంతో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. పరిశ్రమలోనినిర్మాణాలు, ఇనుప సామగ్రి, పైపులు, ఇతర పరికరాలు దెబ్బతిన్నాయి.ఘటనాస్థలంలో భారీగా శిథిలాలు చెల్లాచెదురుగా పడ్డాయి. శిథిలాల కింద పలువురు కార్మికులు చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.ప్రమాదంలో మృతిచెందిన వారు, గాయపడిన వారి వివరాలు, వారి స్వస్థలాలు,క్షతగాత్రుల పరిస్థితిపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది. అలాగే బాయిలర్ పేలుడుకు గల అసలు కారణం ఏమిటన్న దానిపై అధికారులు పరిశీలన చేస్తున్నారు.

# చేనేత వస్త్రప్రదర్శనను ప్రారంభించిన సైబరాబాద్ మున్సిపల్ కమీషనర్ సృజన

**హైదరాబాద్ పెన్ పవర్:** మన చేనేతకళలను మనమే ప్రోత్సహించాలని, చేనేత వస్త్రాలు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా భాద్యతగా ధరించాలని సైబరాబాద్ మున్సిపల్ కమీషనర్ జి.సృజన అన్నారు. శ్రీనగర్ కాలనీ సత్యసాయి
నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరుతో ఏర్పాటుచేసిన చేనేత వస్త్రప్రదర్శనను ఆమె ప్రారంభించారు. దసరా, బతుకమ్మ, దీపావళితో పాటు పలు శుభకార్యాలకు అనువుగా ఇక్కడ చేనేత
కళాకారుల చీరలు కొలువుదీరాయని, చేనేత కళాకారులకు మరింత ఆదరణ లభించాలని ఆకాంక్షించారు. సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా చేనేత వస్త్రకళలు నిలుస్తాయని, భారతీయ వస్త్రాలకుఅంతర్జాతీయంగా ప్రాచుర్యం ఉందన్నారు. చేనేతకారులకు మరింత ప్రోత్సాహం అందించడానికి, వారి ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేసిననిర్వాహకులు శ్రీనివాసరావు, వినయ్‌కుమార్‌ల కృషిని అభినందించారు. వస్త్రప్రదర్శనలోని వస్త్రాలను తిలకించి చేనేతకారులను ప్రశంశించారు. ప్రముఖ నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులైనసిల్క్, కాటన్, డిజైనరీ వస్త్రాలను సుమారుగా 80స్టాల్స్ ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల11వరకు ఈ ఎగ్జిబిషన్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందన్నారు.

# హ్యాండీ క్రాఫ్ట్ మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవరం

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలోని వివిధ రాష్ట్రాల సంప్రదాయ చేనేత వస్త్రాలు, హస్తకళలను ఒకే చోటఅందుబాటులో ఉంచడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు .హైదరాబాద్ మోతీ నగర్ కమ్యూనిటీహాల్ లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్ లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ మేళాను నిర్వహకులతో కలిసి ఆయన ప్రారంభించారు. చేనేత కళాకారులు తయారు చేసిన వస్త్ర ఉత్పత్తులు, హస్తకళాకారులుతయారు చేసిన హ్యాండీ క్రాఫ్ట్ ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని తెలిపారు.దసరా, బతుకమ్మ, దీపావళి పండుగలను పురస్కరించుకుని మంగళగిరి ,ఉప్పాడ, వెంకటగిరి ,భాగల్ పూర్ శారీస్ తో పాటుడిజైనర్ వేర్ ఉత్పత్తులు ఇక్కడ అందుబాటులో ఉంచామని నిర్వహకులు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ వచ్చే నెల ఒకటో తేదీ వరకు కొనసాగుతుంది . దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన బ్రాండెడ్ వస్త్రఉత్పత్తులు వీవర్స్ టు కస్టమర్ కు అందిస్తున్నట్లు నిర్వహకులు మహ్మద్ సాబేర్ అలీ ,అక్బర్ అలీ తెలిపారు. ప్రతి రోజు ఉదయం పది నుండి రాత్రి పది వరకు ఈ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందన్నారు

## మీ వెన్నంటి భారత్ ఉంది:

## అమెరికాలో ప్రవాసులకు పీయూష్ గోయల్ భరోసా

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచంలో ఏ మూలన ఉన్నా, ఎలాంటి కష్టాల్లో చిక్కుకున్నా ప్రవాస భారతీయులకు తమ దేశం అండగా నిలుస్తుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ భరోసా ఇచ్చారు. "మీ వెన్నంటి భారత్ ఉంది" అంటూ అమెరికాలోని ప్రవాస భారతీయులను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. గాంధీ జయంతి సందర్భంగా షికాగోలో పర్యటించిన ఆయన, స్కోకీలోని మహాత్మా గాంధీ స్మారక విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం అక్కడి ప్రవాస భారతీయులతో మాట్లాడారు. గతంలో యెమెన్, ఉక్రెయిన్ సంక్షోభాల సమయంలో విదేశాల్లోని భారతీయుల భద్రత కోసం ప్రభుత్వం ఎంతగా తపించిందో ఆయన గుర్తుచేశారు. "మీరు ఏ దేశంలో, ఏ పరిస్థితుల్లో ఉన్నా మీ మాతృభూమి మీకు అండగా ఉంటుంది. మీ కుటుంబాలకు, మీ పిల్లలకు తోడుగా నిలుస్తుంది" అని గోయల్ స్పష్టం చేశారు. అమెరికా, భారత్ మధ్య ప్రవాస భారతీయులు ఒక జీవ వారధిలాంటి వారని గోయల్ అభివర్ణించారు. "మీలో ప్రతి ఒక్కరూ అమెరికాలో భారత రాయబారులే" అని ఆయన అన్నారు. ప్రవాస భారతీయులు తాము స్వీకరించిన దేశానికి (అమెరికాకు) నిజాయతీగా, నిబద్ధతతో సేవ చేయాలని సూచించారు. అదే సమయంలో, తమ మాతృభూమిని, ఇక్కడి ప్రజలను తమ హృదయంలో పదిలంగా ఉంచుకోవాలని కోరారు. ఈ పర్యటనలో భాగంగా, 1893లో స్వామి వివేకానంద చరిత్రాత్మక ప్రసంగం చేసిన ఫుల్లర్టన్ హాల్‌ను కూడా ఆయన సందర్శించారు.

# అమ్మనాన్న తొలి దైవం అంటారు కానీ మనిషి మాత్రం మానవత్వం మర్చిపోతున్నాడు

**అమ్మనాన్న ఆస్తులు కావాలి... కానీ అమ్మానాన్న మాత్రం వద్దు?**

**అమ్మానాన్నలపై ప్రత్యేక కథనం...**



**ఖమ్మం, పెన్ పవర్, అక్టోబర్ 3 :**
ఒక బిడ్డ పుట్టిన క్షణం నుంచి తల్లిదండ్రుల జీవితం మారిపోతుంది. బిడ్డ నవ్వితే తమ బాధను మరిచిపోతారు. బిడ్డ చదువుకోసం అప్పులు చేస్తారు. బిడ్డ భవిష్యత్తు కోసం తమ కోరికలను పక్కన పెడతారు. పిల్లలకు మంచి జీవితం ఇవ్వాలని తమ జీవితాన్నే త్యాగం చేస్తారు. అలాంటి తల్లిదండ్రులు వృద్ధాప్యంలో అడుగులు తడబడుతున్నప్పుడు, వారి చేతిని పట్టుకోవాల్సిన బాధ్యత మాత్రం పిల్లలదే.
కానీ నేటి సమాజంలో కొన్ని చోట్ల పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. పిల్లలను కంటికి రెప్పలా చూసుకున్న తల్లిదండ్రులే వృద్ధాప్యంలో నిర్లక్ష్యానికి గురవుతున్న ఘటనలు మనసును కలచివేస్తున్నాయి. ఆస్తుల కోసం, కుటుంబ విభేదాల కోసం, వ్యక్తిగత కారణాల కోసం తల్లిదండ్రులను దూరం చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

**ఆస్తి కోసం కాదు... ఆప్యాయత కోసం ఎదురుచూస్తున్నారు!**

తల్లిదండ్రులకు వృద్ధాప్యంలో పెద్ద పెద్ద కోరికలు ఉండవు. ఖరీదైన బట్టలు, విలాసవంతమైన జీవితం కోరుకోరు. తమ పిల్లలు రెండు నిమిషాలు పక్కన కూర్చొని మాట్లాడితే చాలు... ఒక పూట భోజనం ప్రేమగా పెడితే చాలు... అనారోగ్యంగా ఉన్నప్పుడు 'ఎలా ఉన్నావమ్మా అని అడిగితే చాలు.పిల్లలు చిన్నప్పుడు ఒక్క అడుగు వేస్తే ఆనందపడిన తల్లిదండ్రులు... తమ వృద్ధాప్యంలో పిల్లల ఒక్క అడుగు తమ వైపు పడాలని ఎదురుచూడాల్సిన పరిస్థితి రావడం నిజంగా బాధాకరం.

**నిన్న మీ కోసం వారు... నేడు వారి కోసం మీరు**

పిల్లలకు జ్వరం వస్తే రాత్రంతా నిద్రపోకుండా చూసుకున్నది అమ్మ.
పిల్లల చదువుల కోసం తన చెమటను ధారపోసింది నాన్న.
పిల్లల పెళ్లిళ్ల కోసం అప్పులు చేసినవారు తల్లిదండ్రులే.
పిల్లలు జీవితంలో ఎదగాలని తమ జీవితాన్ని త్యాగం చేసినవారు వారే.

**అలాంటి తల్లిదండ్రులకు వృద్ధాప్యంలో మనం ఇచ్చే గౌరవం ఏమిటి?**

తల్లిదండ్రులను చూసుకోవడం దానం కాదు... బాధ్యత
తల్లిదండ్రులను చూసుకోవడం పిల్లలు చేస్తున్న గొప్ప ఉపకారం కాదు. అది తమను పెంచిన మనుషుల పట్ల కనీస మానవ బాధ్యత.డబ్బు సంపాదించడం జీవితంలో అవసరం. ఆస్తులు సంపాదించడం కూడా అవసరమే. కానీ ఆస్తులు మన వెంట రావు. మనం ఎంత సంపాదించినా చివరికి మనతో ఉండేది మనుషుల అనుబంధమే.
ఇల్లు పెద్దదిగా ఉండటం కంటే... ఆ ఇంట్లో అమ్మానాన్నలకు గౌరవం ఉండటం ముఖ్యం.

**వృద్ధాప్యం వారికి శిక్ష కాకూడదు**

చిన్నతనంలో పిల్లలు తల్లిదండ్రులపై ఆధారపడతారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులు పిల్లలపై ఆధారపడాల్సి వస్తుంది. ఇది ప్రకృతి ధర్మం.పిల్లలు చిన్నప్పుడు నడవలేకపోతే తల్లిదండ్రులు చేయి పట్టుకుని నడిపించారు. ఇప్పుడు తల్లిదండ్రుల కాళ్లు బలహీనపడితే అదే చేయి పిల్లలు పట్టుకోవాలి.

**ఒక్కసారి ఆలోచించండి...**

మీరు చిన్నప్పుడు ఏడిస్తే మిమ్మల్ని ఓదార్చింది ఎవరు?
మీకు ఆకలి వేసినప్పుడు తన ఆకలిని మరిచి మీకు అన్నం పెట్టింది ఎవరు?
మీ చదువు కోసం తన అవసరాలను తగ్గించుకున్నది ఎవరు?
మీరు అనారోగ్యంతో ఉన్నప్పుడు రాత్రంతా మీ పక్కన కూర్చున్నది ఎవరు?
ఆ మనుషులే ఈరోజు మీ ప్రేమ కోసం ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు.

రేపటి తరాలు మనల్ని చూసే నేర్చుకుంటాయి!
ఈరోజు మనం మన తల్లిదండ్రులను ఎలా చూసుకుంటున్నామో... రేపు మన పిల్లలు కూడా మనల్ని అలాగే చూసే అవకాశం ఉంది.అందుకే తల్లిదండ్రులను గౌరవించడం ఒక కుటుంబానికి మాత్రమే సంబంధించిన విషయం కాదు... సమాజానికి సంబంధించిన విలువ.
మన పిల్లలకు ఖరీదైన విద్య ఇవ్వడంతో పాటు మంచి సంస్కారం కూడా నేర్పాలి.
అమ్మానాన్నలను గౌరవించడం నేర్పాలి.
వృద్ధులను ఆదరించడం నేర్పాలి.
కుటుంబ బంధాల విలువను తెలియజేయాలి.
"అమ్మానాన్నలను కోల్పోయిన తర్వాత ఫోటోకు దండం పెట్టడం కంటే... వారు బతికున్నప్పుడే వారి చేతిని పట్టుకోండి తల్లిదండ్రులు మనతో ఉన్నంతకాలం వారిని ప్రేమిద్దాం. వారి మాటలు వినండి. వారి ఆరోగ్యం గురించి అడగండి. వారికి సమయం కేటాయించండి. వారు కోరుకునేది ఎక్కువ కాదు---మన ప్రేమ, మన గౌరవం, మన తోడు మాత్రమే.

**చివరి మాట**

ఆస్తులు పోతే మళ్లీ సంపాదించవచ్చు.
డబ్బు పోతే మళ్లీ సంపాదించవచ్చు.
కానీ తల్లిదండ్రులు ఒకసారి దూరమైతే... వారి స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు.

**అమ్మానాన్నలు ఉన్నప్పుడే వారి విలువ తెలుసుకుందాం...**

వారి కన్నీళ్లు తుడుద్దాం...
వారి చేతిని పట్టుకుందాం...
వృద్ధాప్యంలో వారికి మనమే అండగా నిలుద్దాం.
మనిషిగా పుట్టిన ప్రతి ఒక్కరి బాధ్యత: తల్లిదండ్రులను గౌరవించడం, కాపాడడం, ప్రేమించడం.

# సంతోషిమాత ఆలయ ఘటనపై చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్, పెన్ పవర్, అక్టోబర్ 3:** హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్ సంతోషిమాత ఆలయ ఘటనపై ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని ప్రసిద్ధ సంతోషిమాత ఆలయంలో అమ్మవారి విగ్రహంపై దాడి జరిగిన ఘటన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆలయానికి చేరుకున్నారు.
ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆలయంలోకి ఓ వ్యక్తి ప్రవేశించి అమ్మవారి విగ్రహంపై దాడికి పాల్పడిన ఘటన సీసీటీవీ కెమెరాల్లో నమోదైనట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టి, అసలు కారణాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో గతంలోనూ ముత్యాలమ్మ, చిట్టి ముత్యాలమ్మ, సంతోషిమాత ఆలయాలకు సంబంధించిన ఘటనలు చోటుచేసుకున్న విషయాన్ని వారు ప్రస్తావించారు. వరుసగా ఆలయాలకు సంబంధించిన ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో, వీటిపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయాల వద్ద, ముఖ్యంగా అమ్మవారి ఆలయాల వద్ద భద్రతను మరింత పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, ఆలయాల భద్రత విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. సంతోషీమాత ఆలయ ఘటన వెనుక ఉన్న అసలు కారణాలను వెలికితీసేలా సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ముద్ద కళ్యాణ్, చంద్రశేఖర్ అజాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఏదులాపురంలో సీపీఐకి భారీ షాక్

**కాంగ్రెస్‌లో చేరిన ఏఐవైఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు**

**మంత్రి పొంగులేటి సమక్షంలో పలువురి చేరిక**

**ఖమ్మం, పెన్ పవర్, అక్టోబర్ 3:**ఏదులాపురం మున్సిపాలిటీలో సీపీఐకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏఐవైఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు మిర్యాల నరుణ్ తేజ్, రెబ్బగొండ్ల గోపీ సీపీఐకి రాజీనామా చేసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.వరంగల్ క్రాస్ రోడ్డు 28వ వార్డుకు చెందిన గోపీ, 29వ వార్డుకు చెందిన నరుణ్ తేజ్‌తో పాటు 28వ వార్డుకు చెందిన రంగిశెట్టి ఉదయ్, మాతంగి వినోద్, 32వ వార్డుకు చెందిన దారావత్ భాస్కర్, దారావత్ జాను, భూక్యా రవి, ఎర్రంశెట్టి శ్రీను తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.
ఈ సందర్భంగా నూతనంగా కాంగ్రెస్‌లో చేరిన వారు మాట్లాడుతూ ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేస్తున్న కృషికి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం శ్రీనన్నతోనే సాధ్యమని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి తమ వంతు పాత్ర పోషిస్తామని తెలిపారు. ఈ చేరికలతో ఏదులాపురం మున్సిపాలిటీ



పొంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ లో చేరిన సిపిఐ కార్యకర్తలు

పరిధిలో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

**భారీ కార్యక్రమాలకు ఏర్పాట్లు**

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 28న వరంగల్ క్రాస్ రోడ్డు, ఏదులాపురం నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు స్థానిక కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీతో పాటు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

# కూటమి 'ఆపరేషన్ బొత్స'.. సీనియర్ నేతకు ఊహించని దెబ్బ



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ సీనియర్ నాయకుడు, మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ లక్ష్యంగా కూటమి చేస్తున్న రాజకీయం ఆసక్తి రేపుతోంది. దాదాపు 15 ఏళ్లుగా మంత్రిగా పనిచేయడమే కాకుండా, ఉత్తరాంధ్ర రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా ఎదిగిన బొత్సకు ఊహించని షాక్ ఇచ్చేలా అధికార టీడీపీ నేతలు పావులు కదుపుతున్నారని అంటున్నారు. వైసీపీని కోలుకోలేని దెబ్బతీయాలంటే ముందుగా బొత్సను రాజకీయంగా నిర్వీర్యం చేయాలని టీడీపీ అగ్రనేతలు భావిస్తున్నారని చెబుతున్నారు. ఇందులో భాగంగా బొత్స కుటుంబ సభ్యుల నుంచి మొదలుపెట్టి ఆయన అనుచరులు, సన్నిహితులను వైసీపీ నుంచి దూరం చేయాలని పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తున్నారని అంటున్నారు. దీంతో ఉత్తరాంధ్రలో ముఖ్యంగా విజయనగరం జిల్లా వైసీపీలో ఎప్పుడు ఏ వికెట్ పడిపోతుందో తెలియని గందరగోళం నెలకుందని చెబుతున్నారు.

విజయనగరం జిల్లాలో అధికార తెలుగుదేశం పార్టీకి గట్టి ప్రత్యర్థిగా నిలబడిన బొత్సను రాజకీయంగా తేరుకోలేని విధంగా దెబ్బ కొట్టాలని టీడీపీ పెద్దలు ప్లాన్ చేసినట్లుగా ఉందని అంటున్నారు. బొత్సకు నీడగా తిరిగిన ఆయన మేనల్లుడు చిన్న శ్రీనును దూరం చేయడమే కాకుండా, ఆయన ద్వారా విజయనగరం జిల్లాలో బొత్స అనుచరులు అందరినీ వైసీపీ నుంచి బయటకు రప్పించాలని ప్రయత్నాలు జరుగుతున్నాయని అంటున్నారు. ఇందుకోసం రెండు రకాల వ్యూహాలను అమలు చేస్తున్నట్లుగా చెబుతున్నారు. బొత్సపై తిరుగుబాటు చేసేలా కొందరిని ప్రోత్సహించడంతోపాటు తమతో చేతులు కలిపితే మంచి భవిష్యత్తు ఉంటుందని ఊరడించడం ద్వారా మరికొందరని టీడీపీ, జనసేనలోకి తెచ్చేలా ప్లాన్ జరుగుతోందని అంటున్నారు.ఇప్పటికే టీడీపీలో చేరిన జడ్పీ మాజీ చైర్మను చిన్న శ్రీనుకు ఈ బాధ్యతలు అప్పగించారని అంటున్నారు. ఆయన వైసీపీలో తనకు తెలిసిన వారు అందరితో మాట్లాడుతూ, టీడీపీలోకి వస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఆశ చూపుతున్నట్లుగా చెబుతున్నారు. ఇదే సమయంలో వైసీపీలో బొత్స నాయకత్వాన్ని ప్రశ్నించేలా మరికొందరిని ఎగదోసే ప్రయత్నాలు జరుగుతున్నట్లుగా చెబుతున్నారు.

ఈ క్రమంలో వైసీపీ నుంచి సస్పెన్షన్ కు గురైన మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కూడా చిన్న శ్రీనుతో చేతులు కలిపినట్లుగా అనుమానిస్తున్నారు. ఈ విధంగా మాజీ మంత్రి బొత్స కుటుంబ సభ్యుల ద్వారానే ఆయనను నిలువరించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని అంటున్నారు. ఇన్నాళ్లు బొత్స కోసమే పనిచేసిన వారికి సరైన గుర్తింపు లేదని, క్షేత్రస్థాయిలో ఒకరు పనిచేస్తే, పదవులు అన్నీ బొత్స ఆయన వారసులు అనుభవిస్తున్నారని ప్రచారం చేయడం ద్వారా ఆయన సన్నిహితులను కూడా ప్రభావితం చేసేలా ప్లాన్ జరుగుతోందని అంటున్నారు. ఈ విషయమై బొత్స అనుచరులు, సన్నిహితులు కూడా ఆలోచనలకు లోనవుతున్నారని అంటున్నారు.

**టీడీపీ ప్రచారాన్ని నమ్ముతారా?**

ఇక బొత్స లక్ష్యంగా సాగుతున్న ప్రచారంపై ఆయన అనుచరులు, సన్నిహితులు ఎంతవరకు నమ్ముతారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. బొత్స అధికారంలో ఉండగా, ఆయన కుటుంబ సభ్యులే ఎక్కువ పదవులు అనుభవించారని కూటమి ప్రచారం చేస్తుండగా, తాజాగా టీడీపీలో చేరిన జడ్పీ మాజీ చైర్మన్ చిన్న శ్రీను కూడా బొత్స బంధువు అన్న విషయాన్ని ఎత్తిచూపుతున్నారు. పార్టీ మారిన తర్వాత చిన్న శ్రీను కూడా బొత్స మాదిరిగా వ్యవహరిస్తే తమ పరిస్థితి ఏంటి? అని ప్రశ్నిస్తున్నట్లుగా చెబుతున్నారు. అయితే వైసీపీలో పరిస్థితులకు, టీడీపీ రాజకీయాలకు మధ్య తేడాలను చూపుతూ ఆపరేషన్ వైసీపీ చేసేలా టీడీపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నట్లుగా చెబుతున్నారు. మొత్తానికి చిన్న శ్రీను ద్వారా ఆపరేషన్ వైసీపీ కాస్త ఆపరేషన్ బొత్సగా మారిందని అంటున్నారు. స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రలోభాల పర్వంలో ఎక్కువ మంది బొత్స అనుచరులు, సన్నిహితులతో చర్చలు జరుగుతున్నాయని అంటున్నారు.

# "వై నాట్ పులివెందుల" - కూటమి గర్జన, జగన్ హై అలర్ట్!




**హైదరాబాద్ పెన్ పవర్:** స్థానిక ఎన్నికలకు ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో ఏపీలో రాజకీయాలు ఉత్కంఠ రేపుతున్నాయి. ముఖ్యంగా గత స్థానిక ఎన్నికల్లో వైట్ వాష్ కు గురైన ప్రస్తుత అధికార కూటమి ఇప్పుడు విపక్షానికి అదే పరిస్థితి తీసుకురావాలని పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా వైనాట్ పులివెందుల అంటూ నినదించడమే కాకుండా, విపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సొంత నియోజకవర్గంలో మెజార్టీ సీట్లను గెలుచుకునే వ్యూహంతో పనిచేస్తోందని చెబుతున్నారు. గతంలో జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా, వైనాట్ 175, వై నాట్ కుప్పం అంటూ నినాదాలు చేసేవారు. ఇప్పుడు కూటమిలో ముఖ్యనేతలు ఆ విధమైన ప్రకటనలు చేయకపోయినా, పులివెందులలో జగన్మోహనరెడ్డికి ఓటమి రుచి చూపించాలనే లక్ష్యంతోనే అడుగులు వేస్తున్నట్లుగా సంకేతాలు పంపుతున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందులలో ఇప్పటివరకు ఆయన కుటుంబానికి ఎదురులేకుండా పోయింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో కూడా ఈ నియోజకవర్గంలో పోటీపై పెద్దగా దృష్టి పెట్టేవారు కాదని చెబుతున్నారు. జగన్మోహనరెడ్డి తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రాజకీయాల్లోకి వచ్చిన నుంచి పులివెందుల నియోజకవర్గం ఆ కుటుంబానికి కంచుకోటగా ఉండగా, వైఎస్ ఆ తర్వాత జగన్ రెడ్డి చెప్పిన వారికే స్థానిక పదవులు దక్కేవి. అయితే గత ప్రభుత్వంలో జగన్మోహనరెడ్డి అనుసరించిన విధానాలు కారణంగా ప్రతిపక్ష నేతలకు బలమైన స్థానాల్లో కూడా ఆయా పార్టీలు పోటీ చేసే వాతావరణం లేకుండా పోయిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో జరిగే ఎన్నికల్లో అలాంటి వాతావరణం లేకపోయినా ప్రజాస్వామ్యయుతంగానే పోరాడి వైసీపీని ఓడించాలని కూటమి నేతలు వ్యూహరచన చేస్తున్నారని అంటున్నారు.గత ఏడాది జరిగిన పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అనూహ్య విజయం సాధించగా, వైసీపీ అభ్యర్థికి కనీసం డిపాజిట్ రాలేదు. దీంతో గట్టిగా ప్రయత్నిస్తే పులివెందుల నియోజకవర్గంలో మెజార్టీ నియోజకవర్గాలను కైవసం చేసుకోవచ్చునని టీడీపీ కూటమి ప్లాన్ చేస్తోందని అంటున్నారు. ప్రధానంగా వైఎస్ ఫ్యామిలీకి తిరుగులేని బలం ఉన్న పులివెందుల నగర పంచాయతీలో పసుపు జెండా ఎగరవేయాలనే వ్యూహంతో టీడీపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికే వైసీపీలో ఉన్న కొందరితో చర్చలు సాగిస్తున్నారని కూడా ప్రచారం జరుగుతోంది. దీంతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి కూడా స్వయంగా రంగంలోకి దిగినట్లుగా చెబుతున్నారు.

**జగన్ రెడ్డి ఫోకస్**

అధికార పార్టీ 'వై నాట్ పులివెందుల' అంటుండటంతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అలర్ట్ అయ్యారని చెబుతున్నారు. ప్రతిపక్ష నేతల కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్న మాజీ సీఎం జగన్ రెడ్డి పార్టీ శ్రేణులు చేయిదాటిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కడప ఎంపీ అవినాశ్ రెడ్డికి దిశానిర్దేశం చేశారని అంటున్నారు. అదేసమయంలో ముఖ్యమైన కార్యకర్తలతో జగన్ రెడ్డి స్వయంగా మాట్లాడుతూ అధికార పార్టీ ప్రలోభాలకు లొంగవద్దని, తాను ఉన్నానని భరోసా ఇస్తున్నట్లు చెబుతున్నారు. ఇక జగన్ రెడ్డి సూచనలతో ఎంపీ అవినాశ్ రెడ్డితోపాటు ఇతర కుటుంబ సభ్యులు, వైసీపీ ముఖ్యనేతలు నియోజకవర్గంలో పట్టు సడలకుండా పకడ్బందీ వ్యూహరచన చేస్తున్నారని అంటున్నారు. దీంతో పులివెందుల రాజకీయం హాట్ హాట్ గా మారిందని చెబుతున్నారు.

# గ్లోబల్ హార్టికల్చర్ హబ్ సభ భారీ సక్సెస్

**హైదరాబాద్ పెన్ పవర్:**

అన్నమయ్య జిల్లా మదనపల్లెలో జరిగిన హార్టికల్చర్ హబ్ సభ భారీ సక్సెస్ అయిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల కాదర భాష పేర్కొన్నారు. శనివారం రాయచోటి లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గాజుల ఖాదర్ బాషా మాట్లాడారు.మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో మదనపల్లె హార్టికల్చర్ హబ్ సభకురాయచోటి నుండి తండోపతండాలుగా ప్రజలు రైతులు. తరలి వెళ్లారని వివరించారు.రాయలసీమలో వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థకు హార్టికల్చర్ హబ్ ఎంతో బలం. చెప్పారు.మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి నుండి పెద్ద ఎత్తున మదనపల్లె నందు జరిగిన హార్టికల్చర్ హబ్ సభకు తరలివచ్చిన ప్రజలు మరియు రైతులు కు హృదయపూర్వక అభినందనలు నమస్కారములు గాజుల ఖాదర్బాషా తెలియజేశారు..రాయలసీమలో వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థకు హార్టికల్చర్ హబ్ ఎంతో బలమని తద్వారా ఉద్యాన పంటలకు మార్కెట్ గిట్టుబాటు ధరలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు హార్టికల్చర్ హబ్ తో ఒకపక్క రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని దీనివల్ల రాయలసీమలోని రైతులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని ప్రపంచ చరిత్రలోనే ఏ దేశంలో లేని విధంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు మరియు ఐటీ విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ బాబు కృషితో లక్ష కోట్ల రూపాయలతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు ఒక చారిత్రాత్మకమైన విషయమని ఇది చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏకైక లక్ష్యం రాయలసీమను రతనాల సీమగా చూడాలన్నది ఆయన లక్ష్యం అని తెలిపారు దేశానికే వెన్నముకా రైతులని రైతులు సంతోషంగా ఉండాలని రైతులు బాగుంటే రాష్ట్రం బాగుంటుంది అనే నినాదంతో అన్నదాతకు ప్రయోజనం చేకూర్చేందుకు ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు మరియు ఐటి విద్యాశాఖ మంత్రివర్యులునారా లోకేష్ బాబు యొక్క కృషితో రిలయన్స్ అధినేత అనంత్ అంబానీ కి కష్టపడి ఒప్పించి మదనపల్లెలో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయడం అలాగే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కు కూడా శంకుస్థాపన చేయడం 2026 అక్టోబర్ టు సీమ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఎంతో ముందుకు వెళుతుందని రాయలసీమను ఒకపక్క వాటర్ సెక్యూర్డ్ రీజియన్ గా తీర్చిదిద్దే ప్రయత్నం కూడా చేస్తున్నారని తెలిపారు రైతుల కుటుంబంలో చంద్రబాబు నాయుడు పుట్టినారు కాబట్టి ఆయనకు రైతుల కష్టాలు బాగా తెలుసు అని 1997లోనే ఇజ్రాయిల్ నుంచి డ్రిప్ ఇరిగేషన్ తీసుకొచ్చి రైతులకు చంద్రబాబు పరిచయం చేశారని చెప్పారు ఎన్నో పత్రికలలో చంద్రబాబు చూపించిన విధులను చూసి చంద్రబాబును వాటర్ మాన్ గా రాస్తే వైసిపి పార్టీ ఓర్వలేక నానా దుర్భాష పదజాలాలు వాడినారని తెలిపారు ఈరోజు రాష్ట్రంలో ఉన్న ప్రతి రైతు చంద్రబాబు నాయుడు పరిపాలనపై నమ్మకంతో హర్షం వ్యక్తం చేస్తున్నారని చంద్రబాబు నాయుడు ఒక్కరే రైతుల గురించి రాత్రింపగలు ఆలోచిస్తున్నారని గత వైసీపీ ప్రభుత్వంలో రైతులు అప్పుల్లో కురుకుపోయారని వైసీపీ ప్రభుత్వంలో రైతుల ఆత్మహత్యల్లో దేశంలోనే మొదటి స్థానంలో అప్పుడు ఉన్నదని ఇప్పుడు ప్రతి రైతు హాయిగా చంద్రబాబు నాయుడు దీవెనలు అందిస్తున్నారని తెలిపారు తీవ అన్నదాత సుఖీభవ కింద ప్రతిరైతు ఖాతాలో 20000 రూపాయలు జమ చేసిన ఏకైక ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే చంద్రబాబు నాయుడు ఒక్కరే అని తెలిపారు అలాగే రాయచోటి లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలోరాయచోటి రూరల్ టిడిపి మండల అధ్యక్షులు గండికోట సుధాకర్ మీడియాతో మాట్లాడుతూ రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ తో వైసీపీ పార్టీలో వణుకు పుట్టిందన్నారు. రాయచోటి నియోజకవర్గం నుండి చలో మదనపల్లెకు మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో అశేష జనవాహిని తరలి వెళ్లడం చూసి వైసిపి నాయకులకు మతిభ్రమించిందని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. లక్ష కోట్ల రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ అంటే మామూలు విషయం కాదని, పది జిల్లాల్లో 201 క్లస్టర్లలో అభివృద్ధి ప్రణాళిక అని తెలిపారు. వైసీపీ నాయకులు కరువు వచ్చిందని దాని గురించి సహేతుకంగా మాట్లాడడం లేదని, ఏదో మాట్లాడాలని మాట్లాడుతున్నారే తప్ప అందులో విషయమే లేదన్నారు. చంద్రబాబు నాయుడు విమర్శించే అర్హత వారికి లేదని,ఎల్ ని నో ప్రభావంతో ప్రపంచమంతా వర్షపాతం తక్కువగా నమోదు అవుతున్నదని తెలిసినా కూడా విమర్శించడం తగదన్నారు. మీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కరోనా మహమ్మారితో రాష్ట్ర ప్రజలు దుర్భర పరిస్థితులు గడిపారని తల్లి ఒకచోట బిడ్డ ఒకచోట బ్రతకవలసి వచ్చిందని ఆ రోజు తమ పార్టీ వాళ్లు కష్టానికి సహకరించారే గాని మీలాగా నీతి తప్పి ప్రవర్తించి మాట్లాడలేదన్నారు. ప్రపంచంలోని దిగ్గజ దేశాలు, బిల్ గేట్స్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా భావితరాలకు ముందు చూపును చూపించే నాయకుడు చంద్రబాబు నాయుడు పొగుడుతుంటే మీరు విమర్శించడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఇలాంటి కరువు పరిస్థితులు వచ్చినప్పుడే కదా ధైర్యంగా ముందుకు నిలబడి, వర్షపాతం తక్కువ గా నమోదైన గాని రాయలసీమను రత్నాలసీమగా చూడాలని సంకల్పంతో నదుల అనుసంధానం చేయాలని పట్టుదలతో పని చేస్తున్న ఉక్కుమనిషి మా చంద్రబాబు నాయుడు కొనియాడారు. వైసీపీ నాయకులు కరువును కూడా రాజకీయంగా వాడుకోవడం సిగ్గుచేటు అన్నారు.

# కార్యకర్తా...ఎక్కడున్నావయ్యా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏడుకొండల స్వామీ ఎక్కడున్నావయ్యా అని భక్తులు భక్తి పారవశ్యంగా పాడుకుంటారు. అది ఆధ్యాత్మిక తత్వం. రాజకీయాల్లో కూడా అసలైన స్వామి కార్యకర్త అన్నది తెలిసిందే. ఎన్నికల సమయంలో స్వామి ఆ మీదట ఆసామి అన్న సెటైర్లు కూడా కార్యకర్తల మీద ఉన్నాయి. అంటే కూరలో కరివేపాకు అన్న మాట. కార్యకర్తలు గట్టిగా పూనుకోకపోతే ఏ పార్టీకి అయినా విజయాలు దక్కవు అన్నది పచ్చి నిజం. బూత్ లెవెల్ నుంచి క్షేత్ర స్థాయిలో ఎక్కడ ఎన్నికల సమరం జరిగినా ముందుండే సైనికుడు కార్యకర్త. ప్రతీ పార్టీకి జీవగర్ర కార్యకర్త అని స్పష్టంగా చెప్పాల్సిందే. అయితే కార్యకర్తలతో అవసరం ఉన్నపుడే దగ్గరకు తీస్తున్నారు. ఒక్కసారి అధికారం దక్కితే మాత్రం వారికి ఎక్కడో వదిలేస్తున్నారు. పదవులు పవర్ అన్నీ కూడా నాయకుల చుట్టూ తిరిగేవారికే దక్కుతున్నాయి. దాంతో అసలైన కార్యకర్తలు మాత్రం తీరని అన్యాయానికి గురి అవుతున్నారు.

**వారికే వందనం :**

కార్యకర్తలే కీలకం అని ఇపుడు అన్ని పార్టీలు వల్లిస్తున్నాయి. వారితో తాము అని కూడా చెబుతున్నాయి. కార్యకర్తలను పట్టించుకుంటూ వారికే పట్టం కడుతూ నాయకుల ప్రసంగాలు సాగుతున్నాయి. మీరు లేకపోతే మేము లేమని సెంటిమెంట్ డైలాగులు కూడా కొడుతున్నారు. చిత్రమేంటి అంటే ఏ పార్టీ అయినా అధికారం దక్కాక కార్యకర్తలను చిన్న చూపు చూడడం షరా మామూలు వ్యవహారంగానే ఉంటోంది. ఇక టీడీపీలో అయితే కార్యకర్తల విషయంలో ఒక చానల్ ని ఏర్పాటు చేసి ఎంతో కొంత గుర్తింపు ఇస్తున్నారు. వైసీపీ విషయానికి వస్తే క్యాడర్ ని విస్మరించడం వల్లనే 2024 లో చేదు ఫలితాలు వచ్చాయన్నది తెలిసిందే. 2019 కి ముందు ఏకంగా పదేళ్ల పాటు పార్టీ కోసం తమ జీవితాలను అర్పించిన కార్యకర్తలు వైసీపీలో ఎంతో మంది ఉన్నారు.

**రెక్కలు ముక్కలు చేసుకుని :**

వైఎస్సార్ మీద ప్రేమ జగన్ మీద అభిమానం ఇవన్నీ వారి చేత ఎందాకైనా అన్నట్లుగా పరిశ్రమ చేయించాయి. జగన్ ముఖ్యమంత్రి కావాలని గట్టి పట్టుదలతో వారు ఆనాటి అధికార ప్రభుత్వాన్ని ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో అన్ని విధాలుగా నష్టపోయారు. కాలం, వయసు, ధనం కుటుంబాలు ఇలా అన్నీ కూడా ధారపోసి వైసీపీని గెలిపిస్తే ఆ పార్టీ అధికారంలోకి వచ్చాక కార్యకర్తలను పూర్తిగా పక్కన పెట్టేసింది. కార్యకర్తలకు పార్టీకి మధ్యలో వాలంటీర్ల వ్యవస్థను తీసుకుని వచ్చింది. దీంతో కార్యకర్తలు నివ్వెరపోవాల్సి వచ్చింది. తాము పార్టీలో ఉన్నామా లేదా అన్న సంశయంతో పాటు ఆత్మ గౌరవం దెబ్బతిని తీరని అవమానంతో ఆ అయిదేళ్ళూ గడిపారు. అధినాయకత్వం తీరు అలా ఉంటే నియోజకవర్గాలలో ఎమ్మెల్యేల వరసగా అలాగే ఉంది. వారి చుట్టూ ఉంటే అనుచరులకే ప్రాధాన్యత ఇస్తూ సిసలైన కార్యకర్తలను అసలు ఏ మాత్రం పట్టించుకోలేదు. దాంతో కార్యకర్త పార్టీ జెండా వదిలేశాడు. దానికి వైసీపీ భారీ మూల్యం 2024 ఎన్నికల్లో చెల్లించుకోవాల్సి వచ్చింది.

**అండగా ఉంటామని అంటూ :**

భారీ ఓటమి తరువాత వైసీపీకి తత్వం బోధపడిందా లేక కార్యకర్తలతో అవసరం పడిందా అన్నది పక్కన పెడితే ఇపుడు కార్యకర్తల వద్దకు వెళ్తున్నారు. మీరే మాకు కావాలని మొక్కుతున్నారు. బాగా చూసుకుంటామని నమ్మబలుకుతున్నారు. ఇలా ఇపుడు రెండేళ్ళ తరువాత కార్యకర్తల వద్దకు వైసీపీ నేతలు పరుగులు పెట్టి మరీ వెళ్తున్నారు. ఎందుకంటే స్థానిక సంస్థల ఎన్నికలు వారితోనే చేయాల్సి ఉంది కాబట్టి. వైసీపీ ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో సమావేశాలను ఏర్పాటు చేస్తోంది. అలా చేయమని అధినాయకత్వం ఆదేశించింది. అంతే కాదు పార్టీ తరఫున గుర్తింపు కార్డులు కూడా కార్యకర్తలకు అందచేస్తున్నారు ఈ ఐడెంటిటీ కార్డులు ఉన్న వారికి ఐదు లక్షల ప్రమాద బీమా సదుపాయం కూడా కల్పించారు. మీకు మేము అన్ని విధాలుగా మద్దతుగా ఉండి సహకరిస్తామని నాయకులు చెబుతున్నారు. పార్టీ కోసం కష్టపడాలని సూచిస్తున్నారు.

**ముఖాలను చూపించకుండా :**

అయితే ఈ ఐడెంటిటీ కార్డులు ప్రమాదం ముంచుకొస్తే అపుడు కుటుంబానికి వచ్చే పరిహారాలు కాదు తమకు ఏమైనా అవకాశాలు దక్కుతాయా లేదా అన్నదే కార్యకర్తలు నాయకులను అడుగుతున్న ప్రశ్న. తాము ఇప్పటికి పదిహేనేళ్ళుగా పార్టీ కోసం పనిచేసి ఏమీ కాకుండా పోయామన్న ఆవేదన అయితే ప్రతీ వైసీపీ కార్యకర్తలో నిండా ఉంది. కనీసం పార్టీ నాయకులు తమ ముఖాలను కూడా చూపించకుండా గడిపేశారు అన్న విమర్శలు ఉన్నాయి. ఇపుడు తాపీగా మీకు మేమున్నామని అంటూంటే క్యాడర్ దానిని ఏ విధంగా తీసుకుంటుంది అన్నది చర్చగా ఉంది మరి.

**పనిచేసే వారికి :**

నిజానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో పనిచేసే వారిని గుర్తించి పోటీ చేయించమని వైసీపీ అధినాయకత్వం గట్టిగా చెబుతోంది. కానీ గతంలోనూ ఇపుడూ కూడా పార్టీ నాయకుల చుట్టూ తిరిగే కొందరికే అవకాశాలు ఉంటున్నాయని వాపోతున్న వారు ఉన్నారు. బలం ఉన్న వారిని సమర్థులను గుర్తించి ప్రోత్సహిస్తేనే ఆశించిన ఫలితాలు దక్కుతాయని అంటున్నారు. ఈ విషయంలో వైసీపీ క్యాడర్ లో అంతర్మథనం సాగుతోంది. తమకు చాన్స్ దక్కాల్సిందే అన్న డిమాండ్ అయితే సర్వత్రా వినిపిస్తోంది. కార్యకర్తలు ఎక్కడ ఉన్నారని వెతుక్కుంటూ రావడం కాదని వారికి గుర్తింపు గౌరవం ఇవ్వడమే కాకుండా రాజకీయ అవకాశాలు అందిస్తే వారే అందరి కంటికీ స్పష్టంగా కనిపిస్తారు అని అంటున్నారు. మరి స్థానిక ఎన్నికల్లో వైసీపీ నిజమైన కార్యకర్తలకు పట్టం కడుతుందా లేక వారి అవసరం కోసం ఈ విధంగా హామీలు ఇస్తోందా అన్నది తొందరలోనే తేలిపోతుందని అంటున్నారు. కార్యకర్తలే పార్టీకి అసలైన ఆస్తి అన్న సంగతిని ఇప్పటికైనా గుర్తెరిగితేనే వైసీపీకైనా మరే పార్టీకైనా సుదీర్ఘమైన భవిష్యత్తు ఉంటుందని అంటున్నారు.

# జనసేనలో పెరుగుతున్న ఆశావహులు.. కంట్రోల్ చేయడం కష్టమేనా?

**హైదరాబాద్ పెన్ పవర్:** జనసేన పార్టీలో ప్రస్తుతం పదవులు మరియు టికెట్ల కోసం అంతర్గత పోటీ మరియు ఆశావహుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2024 ఎన్నికల్లో 100 శాతంస్ట్రైక్ రేట్‌తో విజయం సాధించి, ప్రస్తుతం అధికార కూటమిలో భాగస్వామిగా ఉండటంతో పార్టీకి ఆదరణ పెరిగింది. రాబోయే 2026 స్థానిక సంస్థల ఎన్నికలనేపథ్యంలో క్షేత్రస్థాయిలో పోటీ మరింత తీవ్రరూపం దాల్చింది.ఈ పరిస్థితికి దారితీసిన ముఖ్య కారణాలు మరియు తాజా పరిణామాలు క్రింది విధంగా ఉన్నాయి. పాత కమిటీల రద్దు చేయడంతో కొత్త నియామకాలపై ఆశలు పెరిగాయి. పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు వీలుగా జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల పాత కమిటీలను రద్దు చేశారు. త్వరలోనే నూతన సంస్థాగత కమిటీల నియామకం చేపట్టనుండటంతో, పదవుల కోసం దశాబ్ద కాలంగా కష్టపడిన పాత జనసైనికులతో పాటు కొత్తగా పార్టీలోకి వచ్చిన వారి మధ్య గట్టి పోటీ నెలకొంది.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో పెరిగిన పోటీ...**

రాబోయే మున్సిపల్, పంచాయతీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావహుల సంఖ్య భారీగా పెరిగింది. ముఖ్యంగా గత ఎన్నికల త్యాగాలను గుర్తుచేస్తూ తమకు ప్రాధాన్యత ఇవ్వాలని కేడర్ డిమాండ్ చేస్తోంది. స్థానిక ఎన్నికల వ్యూహాలను పర్యవేక్షించేందుకు పవన్ కళ్యాణ్ ఐదుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక ప్యానెల్‌ను నియమించారు. దీనికి మంత్రి కందుల దుర్గేష్ సమన్వయకర్తగావ్యవహరిస్తున్నారు.పొత్తుల నేపథ్యంలో సీట్లు తగ్గుతాయన్న ప్రచారంపై పవన్ కళ్యాణ్ కేడర్‌కు స్పష్టతనిచ్చారు."మళ్లీ సీట్లు తగ్గిస్తామంటే కుదరదు" అని స్పష్టం చేస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేనకు తగినన్ని స్థానాలు దక్కాలని పట్టుబడుతున్నారు.ఒకవేళ ఒకే వార్డు లేదా స్థానంలో మిత్రపక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరని పరిస్థితి వస్తే, స్నేహపూర్వక పోటీకైనా సిద్ధపడాలని, ఎక్కడా వెనక్కి తగ్గవద్దని నాయకులకు దిశానిర్దేశం చేశారు.

**సీట్ల కేటాయింపులో...**

సీట్ల కేటాయింపు మరియు అంతర్గత సర్దుబాట్ల విషయంలో కేడర్ అసంతృప్తికి లోనుకాకుండా ఉండేందుకు పార్టీ పీఏసీ చైర్మన్ మరియు మంత్రి నాదెండ్ల మనోహర్ నిరంతర సమీక్షలు జరుపుతున్నారు. సీట్ల కేటాయింపులపై తుది నిర్ణయం పూర్తిగా పవన్ కళ్యాణ్‌దేనని, కేడర్ అంతా క్రమశిక్షణతో ఎన్నికల సన్నద్ధతపై దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## ఈసీ యూటర్న్.. విపక్షాల ఆందోళనతో దిగి రాక తప్ప లేదు?




ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణతోపాటు కొత్త ఓటర్ల చేర్పులపై తీసుకువచ్చిన నిబంధనల విషయంలో ఎన్నికల సంఘం యూటర్న్ తీసుకుంది. కొత్త ఓటర్ల నమోదు కోసం పాత నమూనాలోని ఫారం – 6ని సమర్పిస్తే సరిపోతుందని స్పష్టం చేసింది. అంతేకాకుండా సర్ ప్రక్రియ పూర్తి చేసిన 20 రాష్ట్రాల్లో తొలగించిన ఓట్లు పునఃపరిశీలనకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించింది. సర్ ప్రక్రియ వల్ల లక్షలాదిగా అర్హుల ఓట్లు గల్లంతయ్యాయని విపక్షాలు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకోవడం విశేషంగా చెబుతున్నారు. ఈసీ తాజాగా తీసుకున్న నిర్ణయం వల్ల ఇప్పటికే సర్ పూర్తయిన 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించారు. ఓటర్ల జాబితాలో చోటు దక్కని వారిని, కొత్తగా అర్హత పొందిన యువ ఓటర్లను చేర్చడం దీని లక్ష్యంగా చెబుతున్నారు. విపక్షాల విమర్శలు, ఆందోళనల నేపథ్యంలో తొలగించిన ఓటర్ల వివరాలను మరోసారి పరిశీలించి ఓటు హక్కు కల్పించాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం స్పెషల్ డ్రైవ్ చేపట్టిందని అంటున్నారు. ఇందులో బూత్ లెవెల్ అధికారులు (బీఎల్వో) ప్రస్తుత జాబితాను సర్ కు ముందు ఉన్న ఓటర్ల జాబితాను పోల్చి తొలగించిన ఓట్లను గుర్తించాల్సివుంటుంది. అంతేకాకుండా నేరుగా వారి ఇళ్లకు వెళ్లి పరిశీలిస్తారు. ఒక్కో బీఎల్వో వారానికి 20 నుంచి 25 మందిని కలిసి, వారి అర్హతలను పరిశీలించాల్సివుంటుందని చెబుతున్నారు. ఈ ప్రక్రియను నెల రోజుల్లో పూర్తి చేసి తొలగించిన ఓటర్లను తిరిగి జాబితాలో చేర్చాలని ఈసీ నిర్ణయించిందని అంటున్నారు. ఇక బీఎల్వోలు సేకరించిన వివరాలను గుర్తింపు పొందిన పార్టీల ఏజెంట్లకు అందజేయాలని ఆదేశించింది. ఈ విధంగా ఓట్ల తొలగింపుపై వెల్లువెత్తుతున్న విమర్శల నుంచి బయటపడాలని ఎన్నికల సంఘం ఆలోచిస్తున్నట్లుగా చెబుతున్నారు.

**చిచ్చు రాజేసిన ఫారం–6లో మార్పులు**

సర్ ప్రక్రియతోపాటు ఓటు నమోదు దరఖాస్తు ఫారం – 6లో చేసిన మార్పుల కారణంగా ఈసీ చుట్టూ వివాదాలు చలరేగాయని చెబుతున్నారు. గత జులైలో ఓటరు నమోదు కోసమంటూ ఆన్‌లైన్ పోర్టల్‌లో కొత్త మార్పులు చేశారు. దీని ప్రకారం, మొదటిసారి ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే యువ ఓటర్లు కేవలం తమ వివరాలే కాకుండా, తల్లిదండ్రులు, తాతముత్తాతలకు ఓటు హక్కు ఉందని నిరూపించాల్సివుంటుంది. అంటే మునుపటి 'సర్' ఓటరు జాబితా వివరాలను కూడా సమర్పించాలనే అదనపు డిక్లరేషన్‌ను నిర్బంధం చేశారు. పాత ఓటరు జాబితాలు అందుబాటులో లేకపోవడం, కొత్త ఓటర్ల నమోదు సంక్లిష్టంగా మారడంతో ఈసీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. అంతేకాకుండా ఫారం–6లో మార్పులు చేయాలంటే తప్పనిసరిగా రాజ్యాంగ సవరణ చేయాల్సివుందని చెబుతున్నారు. ఇందుకోసం పార్లమెంటు ఆమోదం పొందాల్సివుందని అంటున్నారు.పార్లమెంటు ఆమోదం లేకుండా ఫారం – 6లో మార్పులు చేయడంపై విపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ విషయంలో అధికార పార్టీతో ఈసీ చేతులు కలిపిందని ఆరోపిస్తూ ఆందోళనలకు సిద్ధమైంది. కొత్తగా ఓటు హక్కు సాధించే యువతకు (+వఙ్గ) వారి పూర్వీకుల పాత రికార్డులను తీసుకురావడం కష్టతరంగా మారుతుందని చెబుతూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేయాలని విపక్షాలు నిర్ణయించాయి. లక్షలాది మంది యువ ఓటర్లను జాబితా నుండి తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ వ్యూహం పన్నిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన విమర్శలు అందరినీ ఆలోచనకు గురిచేశాయని అంటున్నారు. దీంతో ఈసీ దిద్దుబాటు చర్యలు తీసుకునేందుకు ముందుకు వచ్చిందని అంటున్నారు.

ఈ నేపథ్యంలో కొత్త ఓటర్లు తమ తల్లిదండ్రుల లేదా తాత ముత్తాతల మునుపటి ఓటరు వివరాలను సమర్పించాల్సిన నిబంధనను సడలించేలా ఈసీ చర్యలు తీసుకుందని అంటున్నారు. పాత సాధారణ పద్ధతిలోనే ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించింది. అయితే, ఇంకా ా×= ప్రక్రియ కొనసాగుతున్న కొన్ని రాష్ట్రాల్లో మాత్రం ప్రస్తుతానికి ఈ అదనపు నిబంధన కొనసాగుతుందని తెలిపింది. ప్రస్తుతం సర్ ప్రక్రియ కొనసాగుతున్న రెండు తెలుగు రాష్ట్రాలు పాత విధానంలోనే ఓటరు దరఖాస్తులు సమర్పిస్తే సరిపోతుందని ఈసీ వెల్లడించింది. మొత్తానికి ఈసీ వర్సెస్ విపక్షాల మధ్య కొనసాగుతున్న యుద్ధంలో ఎన్నికల సంఘం కాస్త వెనక్కి తగ్గినట్లే కనిపిస్తోందని అంటున్నారు.

## వైసీపీ నుంచి బొత్సనే సస్పెండ్ చేయాలి : బడ్డుకొండ

వైసీపీ నుంచి సస్పెండ్ చేయడంపై నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తీవ్రంగా స్పందించారు. చిన్న శ్రీను బావ మరిదిని అన్న ఏకైక కారణంతోనే తనపై సస్పెన్షన్ విధించారని ఆరోపించారు. తనపై చర్యలు వద్దు అంటూ జిల్లా నేతలు వారిస్తున్నా అధినేత జగన్మోహనరెడ్డి సస్పెండ్ చేశారని, చిన్న శ్రీను వెళ్లినట్లు తాను కూడా కండవా కప్పు కుంటానేమోనని భయపడ్డారని అన్నారు. నెల్లిమర్ల ఇంచార్జి పదవి నుంచి తప్పించి అవమానించినా పార్టీలో కొనసాగాలనే ఆలోచనతో మౌనంగా ఉన్నానని, కానీ జగన్మోహనరెడ్డి మాత్రం పార్టీ నుంచి తొలగించాలని నిర్ణయం తీసుకున్నాక తాను కొనసాగలేనని చెప్పారు. తనతోపాటు అనుచరులు పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.చిన్న శ్రీను నాకు బావమరిది అన్న కారణంగా పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లుగా చెబుతున్నారని, అదే ప్రాతిపదిక అయితే తనకన్నా ముందు సీనియర్ నేత బొత్స సత్యనారాయణ చిన్న శ్రీనుకు బావ అవుతారని, ఆ విధంగా అయితే బొత్సను కూడా సస్పెండ్ చేస్తారా? అంటు ప్రశ్నించారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన తనకు నెల్లిమర్ల నియోజకవర్గంలో బొత్స తమ్ముడు లక్ష్మణరావు అనేక ఇబ్బందులు పెట్టారని, అయినా బొత్స చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తనకు చిన్న శ్రీనుకు సంబంధం లేకపోయినా పార్టీ వ్యతిరేక కార్యకలాపాల పేరుతో తప్పించారని అన్నారు. అయితే తనను ఇంచార్జిగా తొలగించిన నుంచి ఇప్పటివరకు ఎవరితో మాట్లాడ లేదన్నారు.

**జగన్ పై తీవ్ర విమర్శలు**

పార్టీకి రాజీనామా చేస్తున్నట్లుగా ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. తిరుపతి వెంకన్నను బ్రేక్ దర్శనంలో అయినా దర్శించుకోవచ్చు కానీ, జగన్ రెడ్డి దర్శనం మాత్రం ఎవరికీ దొరికేది కాదని అన్నారు. అంతేకాకుండా తన కోడలు టీడీపీ కండువా కప్పుకుందని వైసీపీలో తాను కొనసాగేందుకు వీలు లేదని అంటున్నారని, అలాగైతే జగన్ రెడ్డి సొంత చెల్లెలు షర్మిలా రెడ్డి కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్నారని, దీనికి ఆయన ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. తన బావ మరిది చిన్న శ్రీను జిల్లాలో పార్టీకి అన్నివిధాలుగా సేవ చేస్తే, ఆయనను పక్క జిల్లా వెళ్లిపోమని చెప్పారని, అందుకే ఆయన టీడీపీలో చేరారని అన్నారు.

**పంచాయతీల్లో పోటీ చేస్తాం**

వైసీపీకి రాజీనామా చేసిన తాను ఏ పార్టీలో చేరేది ఇంకా నిర్ణయం తీసుకోలేదని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు స్పష్టం చేశారు. కూటమిలో నేతలు ఎక్కువ అయ్యారని, టీడీపీ, జనసేన, బీజేపీలో చేరమని ఎటువంటి ఆహ్వానాలు లేవని తెలిపారు. ఇప్పటికే నాయకులతో టీడీపీ కిటకిటలాడుతోందని అన్నారు. తనతో ఉన్నవారిని కాపాడుకోవడానికి వచ్చే స్థానిక ఎన్నికల్లో పోటీచేస్తామని స్పష్టం చేశారు. ఏకగ్రీవంగా ఎన్నికలు జరగకూడదని, గెలవకపోతే టికెట్లు ఇవ్వనని జగన్ చెప్పిన విషయాన్ని ప్రస్తావిస్తూ, పంచాయతీ ఎన్నికల్లో అలాంటి ప్రకటనల వల్ల ఉపయోగం ఉండదని అన్నారు. ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు అపర రాజకీయ చాణుక్యుడని, అసెంబ్లీలో తప్ప ఆయనను నేరుగా ఎప్పుడూ కలవలేదన్నారు.

**టీడీపీ మాతృసంస్థ**

ఇక వైసీపీ నుంచి బయటకు వచ్చినట్లు ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆసక్తికర విషయాన్ని బయటపెట్టారు. 2006లో కాంగ్రెస్ పార్టీ తరపున జడ్పీ చైర్మన్ అయిన బడ్డుకొండ 2009లో అదే పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక 2019లో వైసీపీ తరపున రెండోసారి శాసనసభ్యుడిగా గెలిచారు. అయితే తనకు టీడీపీ మాతృ సంస్థ అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశం అయ్యాయి. 1995లో రాజకీయాల్లోకి వచ్చిన తాను ముందుగా టీడీపీలో పనిచేశానని, ఆ తర్వాత బొత్సతో బంధుత్వం కారణంగా కాంగ్రెస్, ఆ తర్వాత వైసీపీలో చేరినట్లు వెల్లడించారు.

# ఈ అలవాట్లు మీకు ఉన్నాయా? అయితే మీకు పిల్లలు పుట్టరు..



సంతానోత్పత్తి విషయంలో మహిళల ఆరోగ్యం ఎంత ముఖ్యమో.. పురుషుల ఆరోగ్యం కూడా అంతే కీలకం. ముఖ్యంగా పురుషుల్లో వీర్యకణాల సంఖ్య, వాటి కదలిక మోటిలిటీ , ఆకారం, నాణ్యత వంటి అంశాలు గర్భధారణ అవకాశాలపై ప్రభావం చూపుతాయి. అయితే ప్రస్తుత జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిడి, నిద్రలేమి, పొగతాగడం, మద్యం వంటి అలవాట్లు పురుషుల స్పెర్మ్ హెల్త్‌పై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ వీడియోలో కొన్ని సాధారణ అలవాట్లు పురుషుల వీర్యకణాల ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేయవచ్చో వివరిస్తున్నారు. ముఖ్యంగా స్మోకింగ్ అలవాటు వల్ల ఆక్సిడేటివ్ స్ట్రెస్ పెరిగి స్పెర్మ్ నాణ్యత దెబ్బతినే అవకాశం ఉంది. అలాగే అధికంగా మద్యం సేవించడం హార్మోన్ల సమతుల్యతపై ప్రభావం చూపడంతో పాటు వీర్యకణాల ఉత్పత్తి, నాణ్యతపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు.అదే విధంగా తరచూ ఫాస్ట్ ఫుడ్, అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారం తీసుకోవడం కూడా ఆరోగ్యానికి మంచిది కాదు. అధిక కొవ్వులు, చక్కెర, ఉప్పు ఉన్న ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం బరువు పెరగడం.. మెటబాలిక్ సమస్యలకు దారితీయవచ్చు. ఇవి పరోక్షంగా పురుషుల సంతానోత్పత్తి ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది.మరోవైపు సమతుల్యమైన ఆహారం తీసుకోవడం ద్వారా మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు. బాదం, వాల్‌నట్స్ వంటి నట్స్, దానిమ్మ, పాలకూర, అరటిపండ్లు, గుడ్లు, చేపలు, చికెన్, వెల్లుల్లి వంటి

పోషకాహారాలను ఆహారంలో భాగం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వీటిలో ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు వంటి పోషకాలు లభిస్తాయి.

అయితే ఒక్క ఆహారం తీసుకోవడం వల్లే స్పెర్మ్ కౌంట్ లేదా నాణ్యత గణనీయంగా పెరుగుతుందని చెప్పలేం. పొగతాగడం, అధిక మద్యం, నిద్రలేమి, అధిక ఒత్తిడి, వ్యాయామం లేకపోవడం వంటి అలవాట్లను తగ్గించడం, ఆరోగ్యకరమైన బరువును కొనసాగించడం, తగినంత నిద్రపోవడం వంటి జీవనశైలి మార్పులు మరింత ముఖ్యమైనవి.సంతానోత్పత్తికి సంబంధించి సమస్యలు ఎదురవుతున్నట్లయితే సోషల్ మీడియాలో వైరల్ అయ్యే వీడియోల ఆధారంగా స్వయంగా చికిత్స చేసుకోవడం కాకుండా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది. అవసరమైతే వైద్యులు సీమన్ అనాలిసిస్ వంటి పరీక్షల ద్వారా వీర్యకణాల సంఖ్య, కదలిక, ఆకారం తదితర అంశాలను అంచనా వేస్తారు.

అందుకే.. మీ రోజువారీ అలవాట్లను ఒకసారి పరిశీలించుకోండి. చిన్న జీవనశైలి మార్పులు మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా ప్రజనన ఆరోగ్యానికి కూడా ఉపయోగపడవచ్చు.

# బీజేపీతో జగన్ పొత్తు.....ఫ్లాష్ బ్యాక్ చెప్పిన మాజీ వైసీపీ నేత

వైసీపీ నుంచి సస్పెండ్ అయిన నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు జగన్ మీద తీవ్ర స్థాయిలో విమర్శలు చేసి రాజకీయ సంచలనం సృష్టించారు. నిజానికి ఆయన ఒక నియోజకవర్గానికి చెందిన నాయకుడు. పెద్దగా ఇప్పటిదాకా మీడియా ముందు మాట్లాడింది కూడా లేదు. అలాంటి ఆయన తనను పార్టీ నుంచి బయటకు పంపించడంతో ఆగ్రహంతో మొత్తం వైసీపీ మీద జగన్ మీద విమర్శలు చేయడమే కాకుండా పార్టీ గుట్టు మట్టూ మీడియా ముందే విప్పేశారు. జగన్ ని ఒక నియంత అన్నారు, ఆయనకు రాజకీయాలు తెలియవు అన్నారు. కార్పోరేట్ తరహాలో ప్రైవేట్ కంపెనీ కింద పార్టీని నడుపుతున్నారు అని ఘాటు విమర్శలే చేశారు. జగన్ వల్లనే వైసీపీ ఓటమి పాలు అయింది అని అతి పెద్ద బండనే వేశారు.



**బీజేపీని వద్దనుకుని :**

ఈ విషయం గతంలో ప్రచారంలో ఉంది కానీ ఇంత అఫీషియల్ గా ఎవరూ బయటకు చెప్పలేదు. 2024 ఎన్నికల్లో బీజేపీ వైసీపీతో పొత్తుకు ముందుకు వచ్చిందని బడ్డుకొండ చెప్పారు. అయితే తన భజన బ్యాచ్ మాటలు విని జగన్ సింహం సింగిల్ గా వస్తుందంటూ బీజేపీ ఆఫర్ ని కాలదన్నారు అని సంచలన విషయాలు బయటపెట్టారు అదే సమయంలో బీజేపీతో పొత్తుని టీడీపీ తన అపరచాణక్యంతో కుదుర్చుకుని 2024లో అధికారంలోకి వచ్చిందని చెప్పారు. చంద్రబాబు రాజకీయ తెలివితేటలను కూడా బడ్డుకొండ కొనియాడారు. ఇక బీజేపీతో పొత్తు లేకపోవడం వల్లనే 2024 ఎన్నికల్లో వైసీపీ చావు దెబ్బ తిందని అన్నారు. మొదటి దశలో ఏపీలో ఎన్నికలు జరిగి ఉంటే విజయనగరం జిల్లాలో తనతో పాటు బొత్స సత్యనారాయణ, కోలగట్ల వీరభద్రస్వామి బొత్స అప్పలనరసయ్య వంటి వారు అంతా గెలిచేవారు అని ఆయన చెప్పారు. బీజేపీతో పొత్తు పెట్టుకుని కూటమి కట్టిన టీడీపీ చివరి దశలో ఏపీలో ఎన్నికలు పెట్టించి సర్దుబాట్లు చేసుకున్నారని ఫలితంగా వైసీపీ దారుణ పరాజయం పాలు అయింది అన్నారు.

**రాజకీయం తెలియదు :**

జగన్ కి రాజకీయం అంటే తెలియదు అని బడ్డుకొండ సీరియస్ కామెంట్స్ చేశారు. తాను జగన్ ఎంపీ కాక ముందు నుంచే రాజకీయాల్లో ఉన్నానని చెప్పారు. సర్పంచ్ నుంచి తాను జిల్లా పరిషత్ చైర్మన్ గా గెలిచి ఎమ్మెల్యేగా రెండు సార్లు పనిచేశాను అన్నారు. జగన్ బొమ్మ అన్ని చోట్లా చెల్లదని చెప్పారు. గ్రామ స్థాయిలో జరిగే సర్పంచ్ ఎన్నికల్లో బంధుత్వాలు కుటుంబాలు పరిచయాలు స్నేహాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఏకగ్రీవాలు జరిగితే ఇంచార్జి పదవి తీసేస్తాను అని జగన్ చెప్పడం మీద ఫైర్ అయ్యారు. పార్టీ మీ సొంత జాగీరా అని ఆయన నిలదీశారు. ఎవరో చెప్పిన స్క్రిప్ట్ ని తాడేపల్లి ఆఫీస్ లో నాలుగు గోడల మధ్యన కూర్చుని చదవడం కాదని ఆయన మండిపడ్డారు. జగన్ తనను పార్టీ నుంచి తొలగిస్తే తన వెంట వచ్చే వారు అంతా గట్టిగా నిలబడతారు అని అన్నారు. పార్టీ కంటే తన అనుచర గణం బంధు గణం, తనను అభిమానించే వారే ఎక్కువగా ఉంటారు అని చెప్పారు. ఇప్పటికే అనేక మంది సర్పంచులు రాజీనామా చేశారని మరింత మంది రానున్న రోజుల్లో వచ్చి చేరుతారు అని ఆయన స్పష్టం చేశారు.

**అందుకే చిన్న శ్రీను టీడీపీలోకి :**

చిన్న శ్రీనుకు జగన్ వైఖరి నచ్చకనే టీడీపీలోకి వెళ్ళారు అని బడ్డుకొండ చెప్పారు. విజయనగరం జిల్లాలో ఉండాలని చిన్న శ్రీను భావిస్తే ఆయనకు భీమిలీ ఎచ్చెర్ల నుంచి పోటీ చేయాలని జగన్ సూచించారు అని చెప్పారు. అది నచ్చకనే ఆయన పార్టీని వీడిపోయారు అని అసలు గుట్టు చెప్పారు. పార్టీలో అధినాయకుడి తీరు బాగా లేదని కార్యకర్తలు అంతా అనుకుంటున్నారని ఆయన విమర్శించారు. వైసీపీ రాజకీయ విధానాలు కూడా సరిగ్గా లేవని బడ్డుకొండ హాట్ కామెంట్స్ చేశారు. తనను అభిమానించే వారు ఉన్నారని అందరితో కలసి తాను తొందరలో కీలక నిర్ణయం తీసుకుంటాను అని బడ్డుకొండ చెప్పారు. వైసీపీ ఓటమి తరువాత గడచిన రెండేళు ్లగా పార్టీ కోసం ఎంతో ఖర్చు చేశాను అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాలు అన్నీ పక్కన పెడితే బీజేపీతో వైసీపీ పొత్తు అన్నది అధికారికంగా రివీల్ చేసిన బడ్డుకొండ ఏపీ రాజకీయాల్లో వైరల్ న్యూస్ ని అందించారు అని అంటున్నారు.

## విదేశాల్లో భారతీయుల హవా.. ఏ దేశంలో ఎంత మంది ఉన్నారో తెలుసా?

ప్రపంచపటంలో ఏ మూలకు వెళ్లినా భారతీయ మూలాలు ఉన్న ముఖం.. ప్రతిభతో మెరిసే ఒక భారతీయుడు కనిపించడం మన దేశానికే గర్వకారణం. విద్య, ఉద్యోగాలు, వ్యాపారం, మెరుగైన జీవనావకాశాలు, ఉన్నత స్థాయి జీవనశైలి లక్ష్యంగా విదేశాలకు పయనమైన భారతీయులు నేడు ఆయా దేశాల పురోగతిలోనే కీలక భాగస్వాములుగా మారారు. ప్రపంచవ్యాప్తంగా నలుమూలలా విస్తరించిన భారతీయ ప్రవాసులు తమ కష్టపడే తత్వంతో శ్రమతో.. అత్యుత్తమ ప్రతిభతో భారత్ ఘనతను ప్రపంచ నలుమూలలా చాటుతున్నారు. ఇటీవలి నివేదికలు, 2026 నాటి గణాంకాల ప్రకారం విదేశాల్లో అత్యధిక సంఖ్యలో భారతీయులు నివసిస్తున్న దేశాల జాబితాలో అమెరికా అగ్రస్థానంలో నిలిచింది. ప్రపంచ సాంకేతిక, వ్యాపార రాజధానిగా విలసిల్లుతున్న అమెరికాలో ప్రస్తుతం సుమారు 61 లక్షల మంది భారతీయులు స్థిరపడ్డారు. ఐటీ నిపుణులు, అగ్రశ్రేణి కంపెనీల సీఈవోలు, శాస్త్రవేత్తలు, డాక్టర్లు, లాయర్లు, వ్యాపారవేత్తలతో పాటు లక్షలాది మంది విద్యార్థులు అమెరికా ఆర్థిక వ్యవస్థను పరుగులు తీస్తున్నారు. రెండో స్థానంలో నిలిచిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో సుమారు 43 లక్షల మంది భారతీయులు నివసిస్తున్నారు. దుబాయ్, అబుదాబి వంటి నగరాల్లో నిర్మాణ రంగం నుంచి ఫైనాన్స్, రిటైల్, టెక్నాలజీ వరకు ప్రతీ రంగంలోనూ మనవాళ్ల ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. అలాగే కెనడాలో సుమారు 32 లక్షల మంది భారతీయులు నివసిస్తూ మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ముఖ్యంగా పంజాబ్, గుజరాత్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెళ్లిన వేలాది మంది అక్కడ శాశ్వత నివాస అవకాశాలు పొంది బలమైన కమ్యూనిటీలుగా రూపుదిద్దుకున్నారు.

**2026 నాటికి విదేశాల్లో భారతీయులు అధికంగా ఉన్న టాప్–10 దేశాలు చూస్తే..**

1. అమెరికా – 61 లక్షలు
2. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) – 43 లక్షలు
3. కెనడా – 32 లక్షలు
4. మలేషియా – 29 లక్షలు
5. సౌదీ అరేబియా – 28 లక్షలు
6. మయన్మార్ – 20 లక్షలు
7. దక్షిణాఫ్రికా – 18 లక్షలు
8. శ్రీలంక – 16 లక్షలు
9. యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) – 13 లక్షలు
10. కువైట్ – 10 లక్షలు

వీరితో పాటు గల్ఫ్ మిగతా దేశాల్లో మన కార్మికులు, ఇంజినీర్లు, వైద్య రంగ నిపుణులు విశేష సేవలందిస్తున్నారు. మలేషియా, మయన్మార్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, బ్రిటన్ దేశాలలోనూ తరాల నాటి భారతీయ సాంస్కృతిక సంబంధాలు విలసిల్లుతున్నాయి.

మనం విదేశాలలో కేవలం సంఖ్యాపరంగానే కాకుండా ప్రభావవంతమైన శక్తిగా ఎదుగుతున్నాము. స్థానిక విదేశీ ఆర్థిక వ్యవస్థలకు వెన్నుముకగా నిలుస్తూనే మరోవైపు మాతృభూమితో తమ ప్రేమానురాగాలను, సాంస్కృతిక బంధాలను ముడివేసుకుని భారతీయ మూలాలను కాపాడుకుంటున్నారు. విదేశీ గడ్డపై మన సంస్కృతిని, సామర్థ్యాన్ని సగర్వంగా చాటుతున్న ఈ భారతీయ జనాభా నిశ్చయంగా మన దేశానికి అతిపెద్ద గర్వకారణం.

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ నేతృత్వంలోని ఎన్నికల సంఘం (ఈసీఐ), ప్రత్యేక సమగ్ర పునఃసమీక్ష (ఎస్ఐఆర్) పూర్తయిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేశించింది. ఎస్ఐఆర్‌లో ఓటర్ల జాబితా నుంచి "తొలగిపోయిన" అర్హులైన ఓటర్లను, అలాగే యువ, తొలిసారి ఓటు వేయనున్న వారిని నమోదు చేయడమే దీని లక్ష్యం. 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ పూర్తయినట్టు ఈసీఐ ఇదివరకే ప్రకటించింది, వీటిలో బిహార్, పశ్చిమ బెంగాల్ కూడా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో, ఎస్ఐఆర్ తర్వాత ఓటర్ల జాబితాలో తామో, తమ తల్లిదండ్రులో ఉన్నారా? అని అడిగే ప్రశ్నను జులైలో చేర్చిన ఫారం-6 ఇకపై ఉపయోగించరు. ఈ ప్రశ్నకు జవాబిస్తే తప్ప దరఖాస్తు సమర్పించే వీలుండేది కాదు. అలా అనేక అడ్డంకులు సృష్టించిన ఆ ఫారం స్థానంలో, ఇప్పుడు చట్టపరమైన సాదా ఫారం-6నే వాడనున్నారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటి సందర్శనల ద్వారా, ఎస్ఐఆర్‌కు ముందు, తర్వాత జాబితాలను పోల్చి తొలగించిన వారిని గుర్తించి, ప్రతి వారం 20-25 మంది చొప్పున నెల రోజుల్లో పరిశీలన పూర్తి చేయాలన్నది లక్ష్యం. నవీకరణ ప్రక్రియ ఇప్పుడు మరింత న్యాయంగా, సమ్మిళితంగా ఉండొచ్చు. కానీ 2026లో ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ నిర్వహించిన తీరు అత్యంత దారుణమైనదన్న వాస్తవాన్ని ఇది చెరిపేయలేదు. కొన్ని వర్గాలు, సముదాయాలు, వలసదారులను జాబితాల నుంచి దూరంగా ఉంచేందుకే కమిషన్ పట్టుబట్టినట్టు కనిపించిందని విమర్శకులు ఆరోపిస్తున్నారు, ఆ ఆరోపణలను కమిషన్ ఖండిస్తోంది.

ప్రతిపక్ష కూటమి మహాత్మా గాంధీ జయంతిన ప్రారంభించిన ఆందోళన ఊపందుకుంటున్న తరుణంలో, ఓటర్ల జాబితాల నవీకరణలో ఎత్తిచూపిన అక్రమాలను ఎలా పరిగణించాలో నిర్ణయించాల్సింది ఇప్పటికీ సుప్రీంకోర్టే. ఎన్నికల జాబితాలను క్రమానుగతంగా శుద్ధి చేయాలన్న సూత్రాన్ని ఎవరూ తప్పుపట్టరు. మరణించిన, నివాసం మారిన వారి పేర్లను తొలగించడం, వయసు లేదా నివాసం రీత్యా అర్హత సాధించిన వారిని చేర్చడం ఎన్నికల వ్యవస్థ ఆరోగ్యానికి అవసరమే. ఈ వాదననే ఈసీఐ కూడా వినిపిస్తోంది. అయితే ఈ ప్రక్రియను ఎలా నిర్వహించారన్న దానిపైనే అనేక ప్రశ్నలు తలెత్తాయి. భారత ప్రజాస్వామ్యంలోని ఒక ముఖ్యమైన రాజ్యాంగ విభాగమైన సుప్రీంకోర్టు, మరో రాజ్యాంగ సంస్థ పనితీరుపై తీర్పు చెప్పి సరిదిద్దాల్సిన బాధ్యత ఉంది. ఇప్పటివరకూ ఓటర్లు, ప్రతిపక్ష పార్టీలు వ్యక్తం చేసిన అనుమానాలు, తన తోటి కమిషనర్ల అభ్యంతరాలను సీఈసీ పక్కనపెట్టినట్టు కనిపించడం కలిసి, ఇటీవలి రాష్ట్ర ఎన్నికల నిజాయితీపైనే తీవ్రమైన సందేహాలు కలిగించాయి. ఈవీఎంలపై అనుమానాలు ఇప్పుడు కొంత చల్లబడ్డాయి, రాష్ట్ర ఎన్నికలు నిజంగానే మిశ్రమ ఫలితాలు ఇవ్వడం వల్ల. కానీ ఎస్ఐఆర్ ప్రక్రియపై వచ్చిన విమర్శలు నిజమైన ఫిర్యాదులతో కూడినవే, విధానపరమైన అంశాల్లో అక్రమాలు కూడా విస్తృతంగా ఎత్తిచూపబడ్డాయి. వాస్తవానికి గణాంకాలు కూడా దీనిపై వివాదాస్పదంగానే ఉన్నాయి. ముసాయిదా జాబితాల నుంచి 13 కోట్లకు పైగా పేర్లను తొలగించినట్టు గతంలో నివేదికలు వచ్చాయి. పశ్చిమ బెంగాల్‌లో సుమారు

## ...తీర్పు తప్పదు!

91 లక్షల మంది ఓటర్లు, ఉత్తరప్రదేశ్‌లో దాదాపు 2.04 కోట్ల పేర్లు ఎస్ఐఆర్ ప్రక్రియలో తొలగించబడ్డాయని సమాచారం.

అయితే, 14 కోట్ల మంది ఓటర్లను, అంటే భారత ఓటర్ల జనాభాలో సుమారు 15 శాతాన్ని జాబితానుంచి తప్పించారని చెప్పడం అతిశయోక్తి కావచ్చు. ఎందుకంటే సుమారు 2.8 కోట్లమంది ఓటర్లు మరణించి ఉండవచ్చు, అంతకు రెట్టింపు సంఖ్యలో ప్రజలు తమ నమోదిత నివాస స్థలంలో అందుబాటులో లేకపోవచ్చు. ఈ వాస్తవాన్ని విస్మరించకూడదు. కానీ అదే సమయంలో, ఎస్ఐఆర్ ప్రక్రియ మౌలికంగానే లోపభూయిష్టమైనది. అది అనుసరించిన అల్గారిథమ్‌లు కొందరిని మినహాయించే దిశలో వంగినట్టు కనిపిస్తున్నాయి, అర్హుడైన ఏ ఓటరూ తన ఓటు హక్కు కోల్పోకూడదన్న సూత్రాన్ని ఇది నెరవేర్చలేకపోయింది. ఈసీ తనకు తానే పొందిన రక్షణ చట్టబద్ధమేనా అన్న కీలక ప్రశ్నతో సహా, సుప్రీంకోర్టు తీర్పు చెప్పాల్సిన అంశాలు చాలా ఉన్నాయి. తన పవిత్రతపై వచ్చే చాలా దాడులను తట్టుకునే ఈసీ సామర్థ్యం కారణంగా ఎన్నికల ప్రక్రియ విశ్వసనీయత భారత ప్రజాస్వామ్యానికి ఒక ప్రత్యేకతగా నిలిచింది. ఎన్నికల ప్రక్రియ అభేద్యతను కాపాడే బాధ్యత అప్పగించిన అధికారుల దుందుడుకు చర్యల వల్ల ఇది దెబ్బతినకూడదు. ఈ విషయంలో ఈసీఐ తన చర్యలను సమర్థించుకుంటుంది, అర్హులను చేర్చే ప్రత్యేక కార్యక్రమం తన నిబద్ధతకు రుజువు అని చెబుతుంది. అయితే నమోదు కార్యక్రమం పశ్చాత్తాపం కాదు, తప్పును సరిదిద్దే ప్రయత్నం మాత్రమే. తొలగించబడిన వారికి మళ్లీ దరఖాస్తు చేసుకునే భారం మోపడం కాకుండా, ఎవరు, ఎందుకు తొలగించారో ప్రతి కేసులోనూ కారణాలు వెల్లడించడం, బాధ్యులను గుర్తించడం కూడా అవసరం. 2027 నుంచి జరగబోయే ఎన్నికలు స్వచ్ఛంగా, పారదర్శకంగా ఉండాలంటే, ఈ విషయంపై సుప్రీంకోర్టు ఎంత త్వరగా తీర్పు ఇస్తే అంత మేలు. ఏ మార్గాన్ని అనుసరించాలో న్యాయస్థానం స్పష్టంగా తేల్చిచెప్పినప్పుడే, భారత ప్రజాస్వామ్యంలో ఓటరు నమ్మకం పునరుద్ధరించబడుతుంది.

ఈ మొత్తం వివాదంలో ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ఓటు హక్కు అనేది పౌరుడికి రాజ్యం ఇచ్చే దయాదాక్షిణ్యం కాదు, అది రాజ్యాంగం కల్పించిన హక్కు. ఆ హక్కును నిరూపించుకునే భారాన్ని పౌరుడిపైనే మోపడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ఎవరైనా ఒక అర్హుడైన ఓటరు తప్పుగా జాబితా నుంచి తొలగించబడితే, అతడు మళ్లీ ఫారాలు నింపుతూ, పత్రాలు సేకరిస్తూ, కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం అతడికి జరిగిన అన్యాయానికి అదనపు శిక్షే. ప్రత్యేక నమోదు కార్యక్రమం విజయవంతం కావాలంటే, బీఎల్ఓలకు సరైన శిక్షణ, తగిన సమయం, నిర్దిష్ట జవాబుదారీతనం కల్పించడం తప్పనిసరి. అంతేకాదు, కార్యక్రమం ఫలితాలను పారదర్శకంగా బహిర్గతం చేయాలి. ఎంతమంది తొలగించబడ్డారు, ఎంతమంది చేర్చబడ్డారు, ఎంతమంది దరఖాస్తులు తిరస్కరించబడ్డాయి, ఎందుకు? అన్న వివరాలను ప్రజల ముందుంచినప్పుడే ఈసీఐపై అనుమానాలు తగ్గుతాయి. అప్పటివరకూ, ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఒక సరిదిద్దే చర్యగా స్వాగతిస్తూనే, అసలైన జవాబుదారీతనం కోసం సుప్రీంకోర్టు తీర్పు కోసం ఎదురుచూడాల్సిందే.

### పనికొచ్చే పలుకు



## గురి తప్పితే.. గెలుపు దూరమే!

"నేలపై తొమ్మిది కుందేళ్లు పరిగెడుతున్నాయి.. వాటిలో ఒకదానిని పట్టుకోవాలనుకుంటే, కేవలం ఆ ఒక్క కుందేలుపైనే దృష్టి పెట్టండి. అంతేతప్ప ఎగిరే ప్రతి కుందేలు వెనుక పరుగెత్తకండి." ప్రపంచప్రసిద్ధ ఈ-కామర్స్ దిగ్గజం 'అలీబాబా' వ్యవస్థాపకుడు జాక్ మా తరచూ చెప్పే ఈ మాటలు వ్యాపార ప్రపంచంలోనే కాకుండా ప్రతి ఒక్కరి జీవితానికి దిశానిర్దేశం చేస్తాయి. ఈ ఉదాహరణకు జాక్ మా ఒక అద్భుతమైన ముగింపునిచ్చారు. "కుందేలు దొరకడం లేదని చెప్పి దానిని మార్చడానికి ప్రయత్నించకండి. ఆ కుందేలును పట్టుకునే వరకు మిమ్మల్ని మీరు మార్చుకోండి" అని స్పష్టం చేశారు.

వ్యాపారంలో లేదా వ్యక్తిగత లక్ష్యాల సాధనలో చాలామంది ఒకేసారి అనేక ఆకర్షణీయమైన అవకాశాల వెనక పడతారు. కానీ ఒకేసారి రెండు మూడు లక్ష్యాల వైపు అడుగులు వేస్తే శక్తి, సమయం, వనరులు విడిపోయి చివరకు దేన్నీ సాధించలేరు. విజయానికి కావాల్సింది సరైన ఏకాగ్రత. ఒక లక్ష్యాన్ని ఎంచుకున్నాక, దాన్ని సాధించే వరకు మిగతా ఏ ఆకర్షణలకూ లొంగకుండా ఉండటమే నిజమైన క్రమశిక్షణ. ఒకవేళ ఆ లక్ష్యాన్ని చేరుకోవడం కష్టంగా అనిపిస్తే, గమ్యాన్ని మార్చడం కంటే మన వ్యూహాలను, నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడమే సరైన మార్గం.

జాక్ మా చెప్పిన ఈ కుందేలు కథ నేటి డిజిటల్ యుగంలో వ్యాపారవేత్తలకు, ఇన్వెస్టర్లకు, ఉద్యోగులకు ఎంతో అవసరం.

స్టార్టప్‌లు -ఏఐ ట్రెండ్ గందరగోళం: ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) హవా నడుస్తోంది. దీనితో పలు నూతన కంపెనీలు తమ అసలు లక్ష్యాన్ని పక్కనపెట్టి, ప్రచారంలో ఉన్న ఏఐ ట్రెండ్ వెనక పరుగులు తీస్తున్నాయి. తమ వినియోగదారుల ప్రాథమిక సమస్యకు పరిష్కారం చూపడం (ఒక కుందేలును పట్టుకోవడం) మానేసి, బజ్ వర్డ్స్ వెనకపడి నిధులు వృథా చేసుకుంటున్నాయి.

ఇన్వెస్టర్లు - 'హాట్ ట్రెండ్స్' ఉచ్చు: వ్యక్తిగత పెట్టుబడుల విషయంలో చాలామంది రోజుకో కొత్త అసెట్‌వైపు ఆకర్షితులవుతారు. క్రిప్టో, మీమ్ స్టాక్స్, స్పెక్యులేటివ్ షేర్లు అంటూ ఒకదాని నుంచి మరొకదానికి మారడం వల్ల తీవ్ర నష్టాలు చవిచూస్తారు. అదే ఒకే స్పష్టమైన వ్యూహానికి కట్టుబడి క్రమశిక్షణతో పెట్టుబడి పెట్టేవారే మార్కెట్లలో సుదీర్ఘకాలం నిలదొక్కుకుంటారు.

కెరీర్ -నైపుణ్యాల అధిక భారం: ఉద్యోగ ప్రపంచంలో నేడు రోజుకో కొత్త కోర్సు అందుబాటులోకి వస్తోంది. కొద్దిరోజులు కోడింగ్, ఆ వెంటనే ప్రాంప్ట్ ఇంజనీరింగ్, ఆపై డిజైనింగ్ అంటూ ప్రతిదానిపై కొద్దికొద్దిగా దృష్టి పెట్టడం వల్ల ఏ రంగానికీ న్యాయం చేయలేరు. ఏదోక నిర్దిష్ట విభాగంలో పూర్తిస్థాయి నైపుణ్యం సాధించిన వారికే మార్కెట్లో అత్యధిక ప్రాధాన్యముంటుంది.

ఈ సిద్ధాంతం ఎక్కడ పుట్టింది?

2000వ సంవత్సరం ప్రారంభంలో 'డాట్-కామ్ బబుల్' కుప్పకూలిన వేళ అలీబాబా తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంది. ఆ సమయంలో సంస్థను గట్టెక్కించడానికి జాక్ మా ఇతర ఉప వ్యాపారాలన్నింటినీ నిలిపివేసి, కేవలం బి2బి ఈ-కామర్స్‌పైనే పూర్తి దృష్టి సారించారు. ఆ సమయంలోనే తన ఉద్యోగులకు ఈ కుందేలు ఉదాహరణను పదేపదే చెప్పారు. "ఒక వ్యాపారవేత్త చేసే అతిపెద్ద పొరపాటు ఏకకాలంలో పలు అవకాశాలను పట్టుకోవడమే. లభించే ప్రతి అవకాశాన్ని ఒడిసిపట్టుకోవడం కాకుండా, సరైనదాన్ని ఎంచుకుని మిగతావాటికి 'నో' చెప్పడమే సీఈఓ నిజమైన బాధ్యత" అని విశ్వసించారు. ఆ తర్వాత చైనాలోని ప్రముఖ రియాలిటీ షో 'విన్ ఇన్ చైనా'లో జడ్జిగా వ్యవహరించినప్పుడు కూడా ఈ సూత్రాన్ని నవ పారిశ్రామికవేత్తలకు నూరిపోశారు.

# ఉద్యాన హబ్‌కు మేధో దన్ను..



కరవు నేలగా ముద్రపడిన రాయలసీమ ఇప్పుడు దేశానికే 'పండ్ల గిన్నె'గా మారే దిశగా తొలి అడుగు వేసింది. అక్టోబర్ 2న మదనపల్లెలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రతినిధి అనంత్ అంబానీ కలిసి ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐఎసఏ)కు శంకుస్థాపన చేశారు. ఇది కేవలం విద్యా సంస్థ ప్రారంభోత్సవం కాదు. రూ.లక్ష కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్ -రాయలసీమ రైజింగ' బృహత్ ప్రణాళికకు మేధో కేంద్రంగా నిలవబోయే సంస్థ. నిమ్మనపల్లె మండలం రామిరెడ్డిపల్లెలో రానున్న ఐఎసఏను ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) తరహాలో తీర్చిదిద్దాలన్నది కూటమి ప్రభుత్వ సంకల్పం. రిలయన్స్ భాగస్వామ్యంతో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో రూపుదిద్దుకునే ఈ సంస్థ డిజిటల్ వ్యవసాయం, కచ్చిత సేద్యం, పంటల పర్యవేక్షణ, స్మార్ట్ నీటిపారుదల, మార్కెట్ సమాచార విశ్లేషణవంటి అంశాలపై పరిశోధన, శిక్షణ అందించనుంది. డిమాండ్‌కు తగ్గట్టుగా పంటలు వేయడంపై రైతులకు సలహాలివ్వడం, వ్యవసాయ అంకుర సంస్థలకు ఇంక్యుబేషన్ కేంద్రాలను అందుబాటులోకి తేవడం దీని లక్ష్యాలు. ఇంతకాలం ప్రయోగశాలలకూ విశ్వవిద్యాలయాలకూ పరిమితమైన విజ్ఞానం పొలం గట్టుకు చేరాలన్నదే ఈ ఆలోచనలోని అసలు సారం. ఇక ప్రభుత్వ లక్ష్యాల విషయానికొస్తే, 'విత్తనం నుంచి ఎగుమతి వరకు' అనే సమగ్ర దృక్పథంతో ఉత్పత్తి, నీటిపారుదల, రహదారులు, నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌ను ఒకే గొలుసుగా అనుసంధానించడం ప్రధానం. ఆరు నెలలపాటు వివిధ శాఖలతో, కేంద్రంతో చర్చించి ఈ ప్రణాళికను రూపొందించినట్టు ప్రభుత్వం చెబుతోంది. అయితే ఐఎసఏకు ప్రత్యేకంగా ఎంత బడ్జెట్ కేటాయించారన్నది ఇప్పటివరకు అధికారికంగా వెల్లడికాలేదు. ఆ సంస్థ ఒక్కటే కాకుండా మొత్తం హబ్ కోసం రూ.లక్ష కోట్లు అంచనా వేశారు. ఇందులో ప్రభుత్వ వాటా రూ.40,352 కోట్లు కాగా, ప్రైవేటు రంగంనుంచి సుమారు రూ.60 వేల కోట్లు సమీకరించాలన్నది ఆశయం. ప్రభుత్వ వ్యయంలో రూ.20,884 కోట్లు నీటిపారుదలకు, సుమారు రూ.15 వేల కోట్లు ఉద్యానాభివృద్ధికి, రూ.4,562 కోట్లు రహదారులకు వెచ్చించనున్నారు. అంటే ఐఎసఏ ఒంటరి ప్రయత్నం కాదు; నీరు, రోడ్డు, పెట్టుబడి, పరిశోధన అనే నాలుగు స్తంభాల మీద నిలిచే నిర్మాణంలో ఒక కీలక భాగం. ఈ సమన్వయమే ప్రాజెక్టుకు బలం. గతంలో ఎన్నో పథకాలు కాగితాల మీద అద్భుతంగా కనిపించినా, నీరు ఒకచోట, మార్కెట్ మరోచోట ఉండటంతో రైతుకు చేరలేదు. ఈసారి ఆ ఖాళీలను పూడ్చే ప్రయత్నం తాజాగా మొదలైంది.

ఈ ప్రాజెక్టు రాష్ట్రానికి, రైతులకు ఏ మేరకు మేలు చేస్తుందో గణాంకాలే చెబుతున్నాయి. పది జిల్లాల్లోని 303 మండలాల పరిధిలో 5,869 గ్రామాలను కలుపుతూ 201 క్లస్టర్లలో పనులు జరుగుతాయి. ప్రస్తుతం 8.41 లక్షల హెక్టార్లుగా ఉన్న ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని మరో 6 లక్షల హెక్టార్లు పెంచి 14.41 లక్షల హెక్టార్లకు చేర్చాలన్నది లక్ష్యం. ఉత్పత్తిని 222 లక్షల మెట్రిక్ టన్నులనుంచి 435 లక్షల టన్నులకు, దాదాపు రెట్టింపు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికోసం అదనంగా 9 లక్షల ఎకరాల ఆయకట్టు సృష్టించి, మరో 4.3 లక్షల ఎకరాల్లో సాగునీటి సౌకర్యాన్ని స్థిరీకరించనున్నారు. నీటి భరోసా లేకుండా విస్తీర్ణం పెంచడం సాధ్యం కాదు కాబట్టి, సాగునీటికి పెద్దపీట వేయడం సరైన ప్రాధాన్యమే. మామిడి, అరటి, టమాటా, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, బెర్రీల వంటి పంటలకు ప్రత్యేక ప్రోత్సాహం లభించనుంది. ఇందులో సంప్రదాయ పంటలతోపాటు అధిక విలువగల కొత్త పంటలుండటం గమనించదగ్గ అంశం. ఇక్కడే ఐఎసఏ పాత్ర కీలకమవుతుంది. ఏ నేలకు ఏ పంట సరిపోతుంది, ఏ ఏడాది ఏ పంటకు గిరాకీ ఉంటుంది, ఎంత నీటితో ఎంత దిగుబడి సాధ్యమనే అంశాలపై శాస్త్రీయ సమాచారం రైతుకు అందితే నష్టభయం తగ్గుతుంది. టమాటా ధరల పతనం, మామిడి గిట్టుబాటు సంక్షోభం వంటివి ఈ ప్రాంత రైతులకు కొత్త కాదు. మార్కెట్ విశ్లేషణ, ముందస్తు అంచనాలు అందుబాటులోకి వస్తే ఇలాంటి ఒడుదొడుకులను కొంతవరకు అధిగమించవచ్చు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ప్రాసెసింగ్ యూనిట్లతో అనుసంధానించే ప్రతిపాదన కూడా ఆహ్వానించదగ్గది. ఎందుకంటే రైతుకు దక్కే ధరలో సింహభాగం పొలం బయటే, అంటే నిల్వ, శుద్ధి, ఎగుమతిలోనే నిర్ణయమవుతుంది. కాలపరిమితి చూస్తే, హబ్‌ను 2026 ఆగస్టునుంచి 2029 జూలై వరకు మూడు దశల్లో పూర్తి చేయాలని ప్రణాళిక. మొదటి దశలో 2027 జూలై నాటికి సుమారు రూ.12,066 కోట్లతో జలాశయాలు, ఎత్తిపోతలు, చెరువుల పనులు పూర్తి చేసి 72 క్లస్టర్లలో కార్యకలాపాలు ప్రారంభించాలన్నది లక్ష్యం. ఐఎసఏ నిర్మాణ గడువు, తరగతులు ఎప్పుడు మొదలవుతాయన్న వివరాలపై మాత్రం స్పష్టత రావాల్సి ఉంది.

అయితే ఆశలు ఫలించాలంటే అమలులో క్రమశిక్షణ, పారదర్శకత అవసరం. లక్ష కోట్ల ప్రణాళికలో ఆరు పదులకు పైగా వాటా ప్రైవేటు రంగంనుంచి రావాలి. ఆ పెట్టుబడులు ఏ మేరకు వస్తాయన్నదే ప్రాజెక్టు విజయానికి గీటురాయి. అలాగే సాగునీటి ప్రాజెక్టుల పూర్తిలో జరిగే జాప్యాలు, భూసేకరణ సమస్యలు గతంలో అనేక పథకాలను దెబ్బతీశాయి. ఈ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని నిర్దిష్టమైన గడువులు, పురోగతి నివేదికలు, బహిరంగ సమీక్షలు ఏర్పాటు చేయడం ప్రభుత్వ బాధ్యత. ఐఎసఏ విషయంలో కూడా కోర్సుల స్వరూపం, ఫీజులు, ప్రవేశ విధానం, అలాగే సంస్థ ఫలితాలు సామాన్య రైతుకు నిజంగా చేరే యంత్రాంగంపై ముందుగానే స్పష్టత ఇవ్వాలి. ఐఎస్‌బీ తరహా సంస్థ కేవలం ఉన్నత వర్గాల మేనేజ్‌మెంట్ కేంద్రంగా మిగిలిపోకుండా, చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడేలా క్షేత్రస్థాయి శిక్షణ, ప్రదర్శన క్షేత్రాలు, స్థానిక భాషలో సలహా సేవలు అందించాలి. ఉద్యాన పంటల భవిష్యత్ స్వరూపం ఈ ప్రయత్నాల మీదే ఆధారపడి ఉంది. అన్నీ అనుకున్నట్టు సాగితే, సీమ జిల్లాలు కేవలం పండ్లు పండించే ప్రాంతంగా కాకుండా, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, శీతల గిడ్డంగులు, ఎగుమతులతో కూడిన పూర్తిస్థాయి ఉద్యాన పరిశ్రమ కేంద్రంగా ఎదుగుతాయి. అది వలసలను తగ్గించి, గ్రామీణ యువతకు స్థానికంగానే ఉపాధి కల్పించే అవకాశం ఉంది. బిందుసేద్యం, డ్రోన్లు, ఉపగ్రహ ఆధారిత పంట పర్యవేక్షణ సాధారణమై, రైతు ఇప్పటి కంటే తక్కువ నీటితో ఎక్కువ ఆదాయం పొందే రోజులు రావచ్చు. అందుకే ఈ శంకుస్థాపనను ఒక ఫలకావిష్కరణగా కాకుండా ఒక బాధ్యత ప్రారంభంగా చూడాలి. నేల, నీరు, నైపుణ్యం, మార్కెట్ ఈ నాలుగూ ఒకే తాటిపైకి వస్తే రాయలసీమ కరవు చరిత్రను పండ్ల తోటల చరిత్ర అధిగమిస్తుంది. ఆ స్వప్నం సాకారం కావాలంటే మాటలకన్నా చేతలే మాట్లాడాలి! ■



ఎంత సంపాదించినా, వ్యాపారాన్ని ఎంతగా విస్తరించినా, ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకున్నా.. ఇంకా ఏమీ సాధించలేదనే భావన మనసులో ఉంటుంది. ఒక లక్ష్యాన్ని పూర్తి చేయగానే, మెదడు కొత్త లక్ష్యాన్ని ఎంచుకుని ఒత్తిడికి గురిచేస్తుంది. అతి పెద్ద ఆశయాల వల్ల కలిగే సమస్య ఇదే. అందుకే కాసేపు ప్రశాంతంగా ఉండి, ఇప్పటివరకు సాధించిన విజయాలను గుర్తించి సంతోషించడం కూడా ఎంతో ముఖ్యం. లక్ష్యాల కోసం మనశ్శాంతిని కోల్పోకుండా.. సాధించాలనే తపనకు, సాధించిన దాన్ని ఆస్వాదించే ఆనందానికి మధ్య సమతుల్యతే అసలైన విజయం.

-మహాదేవ

### వింతల్లో వింతలు

## బీఫ్ ధరల దెబ్బకు బార్బీక్యూ షాప్ షాక్!






టెక్సాస్‌లో బీఫ్ ధరలు మండిపోతుండటంతో ఓ బార్బీక్యూ రెస్టారెంట్ యజమాని ఏకంగా మెనూకే 'కత్తెర' వేశాడు. సింటన్‌లోని 'బటర్స్ బార్బీక్యూ' యజమాని ప్రకారం.. మొత్తం కిరాణా ఖర్చులో 70 శాతానికి పైగా బ్రిస్కెట్‌కే ఖర్చవుతోందట! దీంతో రుచికరమైన బార్బీక్యూ కంటే బిల్లే భయపెడుతోంది. చివరకు వ్యాపారాన్ని కాపాడుకోవాలంటే బ్రిస్కెట్‌కు గుడ్‌బై చెప్పడం తప్ప మరో మార్గం లేదని నిర్ణయించుకున్నారు. "కస్టమర్లకు మాంసం వడ్డిస్తున్నాం.. కానీ బీఫ్ ధరలు మాత్రం మా రెస్టారెంట్‌నే మింగేస్తున్నాయి" అన్నట్టుగా మారింది పరిస్థితి!

# ఈ పదీ అలవాటు చేసుకుంటే.. మీ బ్రెయిన్ పవర్ ఫుల్?!

**చిన్నపాటి వ్యాయామాల నుంచి చన్నీటి స్నానం దాకా ఎన్నో మార్గాలు**

**మెదడుకు పదును పెడుతూ ఉంటే మరింత పవర్**

**ఏమేం చేయాలన్న దానిపై ఆరోగ్య నిపుణులు చేస్తున్న సూచనలివీ..**



పొద్దున్న లేస్తే సవాలక్ష పనులు. ఒత్తిళ్లతో మెదడు మొద్దుబారిపోతుంటుంది. చురుగ్గా ఉండలేకపోతుంటాం. ఏకాగ్రత కుదరదు. కానీ ఈ సమస్యలను తప్పించి మెదడు చురుగ్గా, పవర్ ఫుల్ గా పనిచేసేందుకు పది రకాల అలవాట్లు చేసుకోవాలని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. వీటితో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, ఆలోచనా శక్తితోపాటు మొత్తంగా మెదడు శక్తిమంతం అవుతుందని వివరిస్తున్నారు. ఆ సూచనలు ఏమిటో చూద్దామా..

### శారీరక కదలికలు, వ్యాయామం

వ్యాయామం, శారీరక కదలికలు శరీరంలో రక్త సరఫరా తగిన విధంగా ఉండేలా చూస్తాయి. ముఖ్యంగా మెదడుకు రక్త సరఫరా పెరిగి.. ఆక్సిజన్, పోషకాలు తగిన స్థాయిలో అందుతాయి. అందుకని మరీ కఠిన వ్యాయామాలు చేయాల్సిన అవసరం లేదని.. ఏరోబిక్ వ్యాయామాలు, నడక, జాగింగ్ వంటివి కూడా సరిపోతాయని నిపుణులు చెప్తున్నారు.

### మెదడుకు శక్తినిచ్చే ఆహారం

యాంటీ ఆక్సిడెంట్లు, మంచి ఫ్యాట్స్, విటమిన్లు, మినరల్స్ ఉండే ఆహారం తీసుకుంటే.. మెదడుకు సంబంధించి సమస్యలు నియంత్రణలో ఉంటాయి. ముఖ్యంగా కూరగాయలు, బెర్రీస్, చేపలు, డ్రైఫ్రూట్స్ వంటివి మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి.

### తగినంత మంచి నిద్ర

మనం నిద్రపోయినప్పుడు మెదడు.. మన జ్ఞాపకాలు, కొత్తగా నేర్చుకున్న అంశాలను క్రమపద్ధతిలో స్టోర్ చేసుకుంటుంది. రోజువారీ ప్రక్రియల్లో ఉత్పత్తయ్యే విష పదార్థాలు, వ్యర్థాలను బయటికి పంపిస్తుంది. అలాగని ఎక్కువ సేపు నిద్రపోవడం కాదు. తగినంత సమయం, పూర్తి గాఢనిద్ర ఉండేలా జాగ్రత్త పడాలి.

### ధ్యానం చేయడం

రోజూ కాసేపు ప్రశాంతంగా కూర్చుని ధ్యానం చేయడం వల్ల మెదడులోని గ్రేమేటర్ పెరుగుతుందని హార్వర్డ్ మెడికల్ స్కూల్ పరిశోధనల్లో తేలింది. మనం కొత్త విషయాలు నేర్చుకోవడానికి, జ్ఞాపకశక్తికి, ఉద్వేగాలను నియంత్రించుకోవడానికి ఈ గ్రే మేటరే కీలకం.

### సోషల్ యాక్టివిటీస్..

స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలసి సరదాగా గడపడం, హృదయపూర్వక సంబంధ బాంధవ్యాలను నెరపడం కూడా మెదడు చురుగ్గా, శక్తిమంతంగా ఉండటానికి తోడ్పడుతుందని ఎన్నో పరిశోధనల్లో తేలింది. ఈ అలవాటు వృద్ధాప్యంలో మతిమరపు రాకుండా కూడా చూస్తుందట.

### మెదడుకు మేత.. పజిల్స్..

ఏదైనా చదువుతూ ఉండటం, పజిల్స్, కొత్త సబ్జెక్టులను నేర్చుకోవడం వంటివి మెదడు పనితీరును బాగా మెరుగుపరుస్తాయని అమెరికాకు చెందిన నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ పరిశోధనల్లో తేలింది. మెదడుకు ఎప్పుడూ పనిచెప్తుండటం వల్ల న్యూరోప్లాస్టిసిటీ అంటే మెదడు కణాలు యాక్టివ్ గా ఉండటాన్ని పెంచుతుందట.

### కొత్త భాష, కొత్త వాయిద్యం నేర్చుకోవడం..

ఏదైనా కొత్త భాషను, కొత్త వాయిద్యాన్ని నేర్చుకోవడం వంటివి మెదడులోని వివిధ భాగాలను యాక్టివేట్ చేస్తాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. శరీరంలోని చేతులు, కాళ్లు, చర్మం, కళ్లు వంటి అవయవాలను నియంత్రించే సామర్థ్యం మరింత పెరుగుతుందని.. వృద్ధాప్యంలో వచ్చే సమస్యలను ఇది దూరంగా ఉంచుతుందని వివరిస్తున్నారు.

### చేతి రాతను ప్రాక్టీస్ చేయడం

మంచి చేతి రాతను ప్రాక్టీస్ చేయడం కూడా మెదడు పనితీరును, మోటార్ స్కిల్స్ ను పెంచుతుందట. ఇది భాష, ఆలోచనా శక్తి వంటి వాటిని మెరుగుపరుస్తుందట.

### కాసేపు చల్లటి నీటిలో స్నానం చేయడం

రోజూ కాసేపు చల్లటి నీటిలో స్నానం చేయడం వల్ల శరీరంలో వేగస్ నాడీ స్టిమ్యులేట్ అవుతుందట. నోరాడ్రినలిన్ హార్మోన్ ఉత్పత్తిని పెంచుతుందట. ఇది యాంగ్జైటీని తగ్గించి.. మెదడు చురుగ్గా చేస్తుందట.

### పాజిటివ్ దృక్పథాన్ని పెంచుకోవడం

నెగెటివ్ ఆలోచనలను దూరం పెట్టి.. పాజిటివ్ థింకింగ్ ను పెంచుకోవడం వల్ల శరీరంలో ఒత్తిడికి కారణమయ్యే హార్మోన్లు తగ్గిపోతాయట. మానసిక ఆరోగ్యం బాగుంటే మెదడు పనితీరు బాగుంటుందని.. జీవితకాలం పెరుగుతుందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

# ఇవి తిన్నా.. ఇవి తాగినా కూడా బరువు ఇట్టే తగ్గిపోతారు



'తక్కువ పని చేస్తూనే.. ఎక్కువ ఫలితం పొందాలి'.. చాలా మంది మైండ్స్ దీనికే అలవాటు పడ్డయ్. దీనికే స్మార్ట్ వర్క్ అని పేరు పెట్టి కొత్త కొత్త పద్ధతులు కనుగొంటున్నారు. ఇదే ఎక్సర్ సైజ్ కి, హెల్త్ కి కూడా వర్తిస్తుంది. 'అబ్బ వెయిట్ తగ్గాలంటే రోజూ గన్ని కిలోమీటర్లు ఉరకాల్నా? 'అని చాలా మంది గొణుక్కుంటారు. ఇలాంటి వాళ్ల కోసమే తక్కువ ఎఫర్ట్స్ తో బరువు తగ్గేలా, ఆరోగ్యంగా ఉండేలా కొత్త టిప్స్ కనుగొన్నరు కొంతమంది ఫిట్నెస్ నిపుణులు. 'తిన్న క్యాలరీల కంటే ఎక్కువ క్యాలరీలను ఖర్చు చెయ్యాలి'అని అందరికి తెలిసిన సూత్రాన్ని దీనికి అప్లై చేసినరు.

### రెండు పనులు ఒకేసారి

యాక్టివ్ గా ఉండాలంటే ఎక్సర్ సైజ్ చెయ్యాలి. కానీ మీరు టీవీ చూస్తూ బిజీగా ఉంటారు. చెయ్యాలని తెలిసినా.. బద్ధకంతో చెయ్యలేరు. అందుకే
టీవీ చూస్తూనే కొన్ని పుషప్స్ చేయండి
బ్రష్ చేస్తున్నప్పుడు కొన్ని గుంజీలు తీయండి.
లంచ్, డిన్నర్ తర్వాత కనీసం ఓ ఇరవై నుంచి ముప్పై నిమిషాలు పాటలు వింటూ నడవండి.

### మంచి మసాల దినుసులు

మన జీవక్రియకు తోడ్పడే లవంగం, దాల్చిన చెక్క, పసుపు, ఎర్ర మిరియాలు, అల్లం వంటి పదార్థాలు రోజూ మీ డైట్ లో ఉండే విధంగా చూసుకోండి.
లవంగం, దాల్చిన చెక్క రక్తంలో చక్కెరని తగ్గిస్తాయి.
అల్లం చర్మకాంతికి దోహదం చెయ్యటంతో పాటు ఆహారం సంపూర్ణంగా జీర్ణం కావడా నికి ఉపయోగపడుతుంది.
ఎర్ర మిరియాలు రక్త నాళాల పనితీరుని మెరుగుపరుస్తాయి.
పసుపు పిత్తాశయ పనితీరుని మెరుగుపరుస్తుంది.

### చల్లని నీళ్లు తాగండి

నీళ్ల రుచి ఉష్ణోగ్రతపై ఆధారపడి ఉంటుంది. చల్లని నీళ్లు తాగటం వల్ల ఎలాంటి ఇబ్బంది లేని వారు చల్లని నీళ్లు తాగితే మంచిది. చల్లని నీళ్లు తాగటం వల్ల శరీరంలోని కొన్ని క్యాలరీలు ఖర్చవుతాయి. ఈ పని చెయ్యటం అంత కష్టమైనదేం కాదు. ఒక గ్లాసు చల్లని నీళ్లు తాగితే 10 నుంచి 15 క్యాలరీలు ఖర్చ వుతాయి. బరువు తగ్గటానికి చల్లని ఆహారం తీసుకోవడాన్ని ఐస్ డైట్ అని కూడా అంటారు. చల్లని ఆహారం తీసుకోవడం వల్ల శరీరం వేడెక్కడానికి కొన్ని క్యాలరీలను ఖర్చు చేస్తుంది.

### కొంచెం నడుస్తూ

ఇది చాలా ఈజీ పని. లంచ్ తర్వాత కొద్దిసేపు అలా ఎండలో నడవండి. ఇలా రోజూ చెయ్యటం వల్ల రక్త నాళాల పనితీరు మెరుగవ్వడమే కాకుండా.. మీ శరీరంలో వస్తున్న మార్పుని తక్కువ సమయంలోనే గుర్తుపడతారు.

### కళ్లని మోసం చెయ్యండి

తక్కువ పదార్థాలు ఎక్కువ సేపు తినడం వల్ల మీరు ఈజీగా బరువు తగ్గుతారు. ఇది మీ కళ్లని.. పొట్టని మోసం చెయ్యటం ద్వారానే .. సాధ్యమవుతుంది. మీ పదార్థాలను చిన్న చిన్న పీసులుగా కట్ చేసుకోండి. వాటిని చిన్న ప్లేట్ల లో పెట్టుకుని తినండి.

వీటిని మర్చిపోండి

కొన్ని ఆహార పదార్థాలను విడిచిపెడితేనే మీ శరీ రానికి పట్టిన ఫ్యాటీ వదులుతుంది. ఇందుకు మీరు కొన్ని పదార్థాలను శాశ్వతంగా మర్చిపోతే మంచిది. 'ఒక్క సారి ఊహించుకోండి... మీరు చాక్లెట్ ని తినడం మానెయ్యగలరా?", చాక్లెట్ ను తొందరగా మర్చిపోవడం కష్టమే. అందుకే కొంచెం కొంచెం తినడం తగ్గిస్తూ వెళ్లండి. అలాగే స్వీట్స్ ని కూడా. శరీరానికి రోజుకు 500 క్యాలరీలు అవసరం. దీంతో పాటు వారానికి ఒక రోజు జీర్ణాశయానికి ప్లేట్ రెస్ట్ కావాలని న్యూట్రి షన్స్ అంటున్నారు. దీనికి తగ్గట్టుగా డైట్ ని ప్లాన్ చేసుకోవాలని సూచిస్తున్నారు.

### తక్కువ క్యాలరీలు

యాపిల్స్ తినడం వల్ల కడుపు నిండిన ఫీలింగ్ కలుగుతుంది. భోజనానికి 15 నిమిషాల ముందు యాపిల్స్ తినడం వల్ల తక్కువ తింటారు. దీని వల్ల రోజు మొత్తంలో మీరు తీసుకునే ఆహారంలో దాదాపు 200 క్యాలరీల వరకు తగ్గుతాయి.



# మెదడుకూ పోటు

అధిక రక్తపోటు అనగానే ముందుగా గుండె జబ్బులే గుర్తుకొస్తుంటాయి. ఇది మెదడులో సూక్ష్మ రక్తనాళాలు, వాటి చుట్టుపక్కల మెదడు కణజాలాన్నీ దెబ్బతీస్తుంది. దీంతో పక్షవాతం, విషయ గ్రహణ సామర్థ్యం తగ్గటం, మతిమరుపు ముప్పులు పెరుగుతాయి. అయితే పైకి ఎలాంటి లక్షణాలు లేకుండానే చడీ చప్పుడు లేకుండా సూక్ష్మ రక్తనాళాలు, మెదడు కణజాలం దెబ్బతింటూ వస్తుంటాయి. అధిక రక్తపోటును నియంత్రించుకుంటే దీన్ని సైతం తగ్గించుకునే అవకాశముందని తాజా అధ్యయనం భరోసా ఇస్తోంది. ఇందులో అధిక రక్తపోటు ఉండి, గుండెజబ్బు ముప్పు ఎక్కువగా గల 50 ఏళ్లు, అంతకన్నా ఎక్కువ వయసువారిని నిశితంగా పరిశీలించారు. వీరికి పై అంకె (సిస్టాలిక్ రక్తపోటు) 120 లేదా 140 కన్నా తక్కువగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. సిస్టాలిక్ రక్తపోటు 120కి మించకుండా చూసుకున్నవారిలో గుండె పోటు, పక్షవాతం, గుండె వైఫల్యం, గుండెజబ్బులతో మరణించటం తక్కువగా ఉంటున్నట్టు తేలింది. అలాగే మెదడులో సూక్ష్మ రక్తనాళాల జబ్బు ముదిరే వేగం నెమ్మదించినట్టూ పరిశోధకులు గుర్తించారు. హైబీపీ కొద్దిగా తగ్గినా పెద్ద ప్రయోజనమే ఉంటుండటం గమనార్హం. రక్తపోటు 10 ఎంఎంహెచ్‌జీ మేరకు తగ్గితే 21.2 శాతం.. 10 నుంచి 20 ఎంఎంహెచ్‌జీ తగ్గితే 26.3 శాతం.. అదే కనీసం 20 ఎంఎంహెచ్‌జీ తగ్గితే 39.4 శాతం జబ్బు ముదిరే వేగం పడిపోయినట్టు తేలింది. అధిక రక్తపోటు గలవారికి అవసరమైతే డాక్టర్లు మాత్రలు సూచిస్తుంటారు. వీటిని వాడుకోవటంతో పాటు ఆహారంలో ఉప్పు తగ్గించుకోవటం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం, కంటి నిండా నిద్రపోవటం, ఒత్తిడి నుంచి బయటపడటమూ ముఖ్యమే.

## ఆసియా క్రీడలు: హాకీలోనూ 'డబుల్ గోల్డ్'.. పురుషుల స్వర్ణం కూడా భారత్ కైవసం

- ఆసియా క్రీడల హాకీలో భారత్‌కు స్వర్ణ పతకం
- ఫైనల్‌లో మలేషియాపై 5-1 తేడాతో ఘన విజయం
- తొలిసారి పురుషులు, మహిళల జట్లు రెండూ స్వర్ణం సాధించి రికార్డు
- ఈ విజయంతో లాస్ ఏంజెల్స్ 2028 ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత



ఆసియా క్రీడల హాకీలో భారత పురుషుల జట్టు పసిడి విజేతగా అవతరించింది. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మలేషియాను 5-1 గోల్స్ తేడాతో చిత్తు చేసి స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. ఈ విజయంతో భారత జట్టు వరుసగా రెండోసారి ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన జట్టుగా నిలవడమే కాకుండా, లాస్ ఏంజిల్స్ వేదికగా 2028లో జరిగే ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించింది. ఆసియా క్రీడల చరిత్రలో భారత పురుషుల హాకీ జట్టుకు ఇది ఐదో స్వర్ణం కావడం విశేషం.జపాన్‌లోని గిఫు ప్రిఫెక్చురల్ గ్రీన్ స్టేడియంలో జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ఆట 11వ నిమిషంలోనే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. అయితే, 14వ నిమిషంలో మలేషియా ఆటగాడు షెల్లో సిల్వేరియస్ ఫీల్డ్ గోల్ చేసి స్కోరును 1-1తో సమం చేశాడు. దీంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. కానీ, ఆ తర్వాత భారత ఆటగాళ్లు మలేషియాకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. 23వ నిమిషంలో జుగరాజ్ సింగ్ పెనాల్టీ కార్నర్‌తో, 42వ నిమిషంలో హార్దిక్ సింగ్ పెనాల్టీ స్ట్రోక్‌తో గోల్స్ సాధించి భారత్‌కు 3-1 ఆధిక్యాన్ని అందించారు. చివరి క్వార్టర్‌లో మరింత దూకుడు పెంచిన భారత్, 54వ నిమిషంలో శిలానంద్ లక్రా ఫీల్డ్ గోల్, 57వ నిమిషంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ మరో పెనాల్టీ కార్నర్ గోల్‌తో 5-1 తేడాతో భారీ విజయాన్ని ఖరారు చేశారు.

### చారిత్రాత్మక డబుల్ గోల్డ్

ఈ ఆసియా క్రీడలు భారత హాకీకి చిరస్మరణీయంగా నిలిచిపోతాయి. శుక్రవారం జరిగిన మహిళల ఫైనల్‌లో భారత జట్టు చైనాను 1-0 తేడాతో ఓడించి 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ స్వర్ణం సాధించిన విషయం తెలిసిందే.

తాజాగా పురుషుల జట్టు కూడా స్వర్ణం గెలవడంతో, ఒకే ఆసియా క్రీడల్లో భారత పురుషుల, మహిళల హాకీ జట్లు రెండూ స్వర్ణ పతకాలు గెలవడం ఇదే తొలిసారి.

ఈ టోర్నీ ఆద్యంతం భారత్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. హోరాహోరీగా సాగిన సెమీ ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై ఆఖరి నిమిషంలో గోల్ చేసి 4-3 తేడాతో గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లింది. అంతకుముందు లీగ్ దశలో ఇండోనేషియా, శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి జట్లపై భారీ గోల్స్ తేడాతో విజయాలు నమోదు చేసి తన సత్తా చాటింది. ఈ అద్భుత విజయంతో భారత హాకీ జట్టు ఆత్మవిశ్వాసంతో ఒలింపిక్స్‌కు సిద్ధమవుతోంది.

# ఆరంభంలో వెనుకంజ.. చివర్లో పతకాల పంజా!

# ఆసియా క్రీడల్లో భారత్ జోరు



రెండు రోజుల క్రితం పతకాల పట్టికలో భారత్ టాప్-10లో కూడా లేదు. తర్వాత పుంజుకొని టాప్-5లోకి దూసుకొచ్చింది. ఆరంభంలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా.. చివరి రెండు రోజుల్లో భారత క్రీడాకారులు అద్భుతాలు చేశారు. వరుసగా స్వర్ణాలు సాధిస్తూ పతకాల వేటలో కొత్త ఊపు తీసుకొచ్చారు. హాకీ, క్రికెట్ నుంచి ఆర్చరీ, బాక్సింగ్, రెజ్లింగ్ వరకు సత్తా చాటారు. మొత్తంగా 21 స్వర్ణాలు సహా 85 పతకాలతో ఆసియా క్రీడల ప్రస్థానాన్ని 4వ స్థానంతో ముగించారు. కొన్ని విభాగాల్లో నిరాశ ఎదురైనా.. మరికొన్ని క్రీడల్లో సరికొత్త చరిత్ర సృష్టించారు.

### చివర్లో ఒక్కసారిగా జోరు!

ఆసియా క్రీడల్లో భారత్ ప్రస్థానం ఒడుదొడుకులతో సాగింది. గురువారం నాటికి ఖాతాలో 10 స్వర్ణాలు మాత్రమే ఉన్నాయి. పతకాల పట్టికలో టాప్-10 కింద నిలిచింది. అయితే చివరి రెండు రోజుల్లో సీన్ మారిపోయింది. క్రికెట్, హాకీ జట్లు పసిడి పతకాలు సాధించాయి. ఆర్చరీ, బాక్సింగ్, రెజ్లింగ్‌లోనూ భారత క్రీడాకారులు మెరిశారు. దీంతో చివరి రెండు రోజుల్లోనే మరో 11 స్వర్ణాలు ఖాతాలో చేరాయి. భారత్ టాప్-5లోకి దూసుకొచ్చింది.

### హాకీలో చరిత్ర.. క్రికెట్‌లోనూ పసిడి

ఈసారి భారత హాకీ జట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళల జట్టు 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ స్వర్ణం గెలుచుకుంది. పురుషుల జట్టు కూడా మలేసియాపై 5-1తో ఘన విజయం సాధించి టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఒకే ఆసియా క్రీడల్లో పురుషులు, మహిళల జట్లు స్వర్ణాలు గెలవడం ఇదే తొలిసారి. ఈ విజయాలతో రెండు జట్లూ 2028 లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించాయి. క్రికెట్‌లోనూ పురుషులు, మహిళలు స్వర్ణాలు గెలిచి భారత్ ఖాతాలో పసిడి పతకాలు జమ చేశారు. కబడ్డీలోనూ ఇరు జట్లు స్వర్ణ విజేతలుగా నిలిచాయి.

### ఆర్చరీలో అమ్మాయిల అదుర్స్!

ఆర్చరీలో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శన చేశారు. ఈ విభాగంలో ఐదు స్వర్ణాలు సహా మొత్తం 9 పతకాలు సాధించారు. మహిళల వ్యక్తిగత రికర్వ్‌లో 17 ఏళ్ల కుమ్‌కుమ్ స్వర్ణం గెలిచి చరిత్ర సృష్టించింది. ఆసియా క్రీడల్లో ఈ విభాగంలో స్వర్ణం సాధించిన తొలి భారత మహిళగా నిలిచింది. మహిళల రికర్వ్ జట్టు కూడా తొలిసారి పసిడి పతకాన్ని అందుకుంది. నీరు ధండా షూటింగ్‌లో మహిళల ట్రాప్ విభాగంలో స్వర్ణం గెలిచి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. గోల్ఫ్‌లో ప్రణవి ఉర్స్ వ్యక్తిగత స్వర్ణంతో మెరిసింది.

### అథ్లెటిక్స్‌లో అత్యధిక పతకాలు

భారత్‌కు అత్యధిక పతకాలు అందించింది అథ్లెటిక్సే. ఈ విభాగంలో 24 పతకాలు వచ్చాయి. ఒక స్వర్ణం, 9 రజతాలు, 14 కాంస్యాలు దక్కాయి. షూటింగ్‌లో 15, ఆర్చరీలో 9 పతకాలు లభించాయి. బాక్సింగ్, రెజ్లింగ్‌లో చెరో ఆరు పతకాలు వచ్చాయి. రెజ్లింగ్‌లో అమన్ శెహ్రావత్, సుజీత్ కల్కల్ స్వర్ణాలు సాధించగా.. లవ్లీనా బోర్గోహెయిన్, పర్వీన్ హుడా, అంకుశ్ పంఘాల్ బాక్సింగ్‌లో పసిడి పతకాలు గెలిచారు.

## ఆరంభంలో తడబడ్డా.. రాహుల్ సెంచరీతో భారత్ భారీ స్కోరు.. రోహిత్ శతకం మిస్



వెస్టిండీస్‌తో మూడో వన్డేలో ఆరంభంలో ఎదురైన ఎదురుదెబ్బల నుంచి కోలుకున్న భారత జట్టు భారీ స్కోరు చేసింది. కేఎల్ రాహుల్ సూపర్ సెంచరీతో చెలరేగాడు. రోహిత్ శర్మ, రుతురాజ్ గైక్వాడ్ కూడా రాణించడంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 351 పరుగులు చేసింది. తొలుత 4 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును ఓపెనర్ రోహిత్, గైక్వాడ్ ఆదుకున్నారు. ఆ తర్వాత రాహుల్ తనదైన శైలిలో విరుచుకుపడ్డాడు. దీంతో విండీస్ ముందు 352 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది. విండీస్ బౌలర్లు ఆరంభంలో భారత బ్యాటర్లను బాగా ఇబ్బంది పెట్టారు. పిచ్ నుంచి లభించిన సహకారంతో జేడెన్ సీల్స్ చెలరేగాడు. శుభ్‌మన్ గిల్ (1), విరాట్ కోహ్లీ (0)లను పెవిలియన్‌కు పంపి భారత్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. దీంతో భారత జట్టు 4 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయింది.ఈ దశలో రోహిత్ శర్మ, రుతురాజ్ గైక్వాడ్ బాధ్యత తీసుకున్నారు. ఆరంభంలో ఆచితూచి ఆడిన ఈ జోడీ క్రమంగా వేగం పెంచింది. విండీస్ ఫీల్డర్లు గైక్వాడ్ ఇచ్చిన క్యాచ్‌లను వదిలేయడం అతడికి కలిసొచ్చింది. ఇద్దరూ అర్ధశతకాలు సాధించి మూడో వికెట్‌కు 137 పరుగులు జోడించారు. రోహిత్ 92 పరుగులు చేయగా.. గైక్వాడ్ 57 పరుగులతో రాణించాడు. నమన్ ధీర్ సైతం 30 పరుగులు చేసి భారత స్కోరును ముందుకు తీసుకెళ్లడంతో కీలక పాత్ర పోషించాడు.ఇక, కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్‌ను తనదైన శైలిలో ముందుకు నడిపించాడు. విండీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగి పరుగుల వేగం పెంచాడు. కేవలం 80 బంతుల్లోనే శతకం పూర్తి చేసుకున్నాడు. చివరి వరకు క్రీజులో నిలిచి 129 పరుగులతో అజేయంగా నిలిచాడు. అతడి ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, 6 సిక్సర్లు ఉన్నాయి. రాహుల్ మెరుపు ఇన్నింగ్స్‌తో భారత్ 350 పరుగుల మార్కును దాటి భారీ స్కోరు సాధించింది.



# కాంతార పార్ట్ 3.. కొత్త ప్రొడ్యూసర్ ఎంట్రీ తప్పదా?



కాంతార 3 ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్న ఫ్యాన్స్ లో ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ ప్రశ్న మొదలైంది. ఈసారి సినిమా కంటే నిర్మాత గురించే చర్చ జరుగుతోంది. రిషబ్ శెట్టి- హోంబలే ఫిల్మ్స్ కాంబోలో వచ్చిన రెండు చిత్రాలు భారీ విజయాలు సాధించిన నేపథ్యంలో.. మూడో పార్టు కోసం కొత్త ప్రొడ్యూసర్ రంగంలోకి దిగుతున్నారనే టాక్ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

అయితే కాంతార ఫ్రాంచైజీ నుంచి మూడో సినిమా రావడం దాదాపు ఖాయమే. రిషబ్ శెట్టి ఇప్పటికే క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం కథ, స్క్రిప్ట్ కు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. కాంతార మొదటి సినిమా 2022లో వచ్చింది. చిన్న బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా ఊహించని స్థాయిలో విజయం సాధించింది. రిషబ్ శెట్టి యాక్టింగ్, దర్శకత్వంతో పాటు కథ, దైవ విశ్వాసాల నేపథ్యం ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి.ఆ విజయంతో కాంతార ఒక సినిమాగా కాకుండా పెద్ద ఫ్రాంచైజీగా మారింది. ఆ తర్వాత కాంతార: చాప్టర్ 1ను భారీ స్థాయిలో తెరకెక్కించారు. మొదటి సినిమాతో పోలిస్తే ఈసారి బడ్జెట్ కూడా పెరిగింది. అయినా బాక్సాఫీస్ దగ్గర సినిమాకు భారీ రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మూడో భాగంపై అంచనాలు మరింత పెరిగాయి. రిషబ్ శెట్టి కథను మరో స్థాయికి తీసుకెళ్లేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇక్కడే కొత్త చర్చ మొదలైంది.కాంతార మొదటి రెండు సినిమాలను నిర్మించిన హోంబాలే ఫిల్మ్స్ మూడో భాగంలో కూడా కొనసాగుతుందా లేదా అనే దానిపై క్లారిటీ లేదు. రిషబ్ శెట్టి మరో నిర్మాణ సంస్థతో కలిసి కాంతార 3 చేయబోతున్నారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆ చర్చకు ప్రధాన కారణం రిషబ్ శెట్టి, హోంబాలే ఫిల్మ్స్ కు సంబంధించిన కొన్ని సోషల్ మీడియా సిచ్యువేషన్స్. కాంతార యానివర్సరీ సందర్భంగా రిషబ్ శెట్టి సినిమా మెమొరీస్ షేర్ చేసుకున్నారు.అయితే ఆ పోస్టులో హోంబాలే ఫిల్మ్స్ ప్రస్తావన కనిపించలేదు. అటు హోంబాలే ఫిల్మ్స్ కూడా స్పెషల్ పోస్టు చేసింది. అందులో రిషబ్ శెట్టి ప్రస్తావన లేదు. దీంతో రిషబ్, హోంబలే మధ్య ఇంకా డిఫరెన్సెస్ పెరిగాయా అంటూ నెటిజన్లు డిస్కస్ చేసుకుంటున్నారు. గతంలో కూడా రిషబ్ శెట్టి హోంబలే ఫిల్మ్స్ ను సోషల్ మీడియాలో అన్‌ఫాలో చేశారంటూ వార్తలు వచ్చాయి. అలాగే క్రియేటివ్ డిఫరెన్సెస్, డబ్బు విషయంలో విభేదాలు ఉన్నాయంటూ కొన్ని ఊహాగానాలు వినిపించాయి.కానీ వాటిపై ఇప్పటి వరకు ఎవరూ రెస్పాండ్ అవ్వలేదు. అందుకే ప్రస్తుతం కాంతార 3కి కొత్త నిర్మాత వస్తున్నారని చెప్పడం కంటే.. కొత్త నిర్మాత వచ్చే అవకాశం ఉందనే చర్చ మాత్రమే నడుస్తోందని చెప్పాలి. మరి కాంతార 3 నిర్మాణం విషయంలో చివరకు ఏ నిర్ణయం తీసుకుంటారనేది చూడాలి. హోంబలే ఫిల్మ్స్ కంటిన్యూ అవుతుందా, లేక కొత్త నిర్మాణ సంస్థ వస్తుందా అనే దానిపై అఫీషియల్ అనౌన్స్మెంట్ వచ్చిన తర్వాతే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965